
సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
శనివారం, 18.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 176
పేజీలు: 12 వెల: రూ. 5

## అక్షరాల భవిష్యత్తు ఎటు?
### ఏఐ దెబ్బకు అక్షరాలకు ఆపద 04

- కంటెంట్ రంగంలో యంత్రాల దూకుడు.. రైటర్లకు ముప్పు
- వేగం కోసం సృజనను త్యాగం చేస్తున్న మీడియా
- ఏఐ వాడకం పెరిగేకొద్దీ తగ్గుతున్న మానవీయ స్పర్శ






# కాషాయ కలవరం
## తెలంగాణలో అష్టకష్టాలు
## ఓవైపు దక్షిణాది వాదన


- మరోవైపు తేజస్వీ విభజన చిచ్చు
- సవరించుకోవడంలో విఫలం
- బలం పెరుగుతుందనే సమయంలో..
- వెనక్కి పరుగెడుతున్న నినాదం
- బీజేపీ టార్గెట్ గా కాంగ్రెస్, బీఆర్ఎస్ దూకుడు
- ఏకమైన విపక్షాలు.. డిఫెన్స్ లో బీజేపీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
8 ఎంపీ స్థానాలు.. 8 ఎమ్మెల్యే స్థానాలు.. గ్రామీణంలో కూడా పెరుగుతున్న బలం.. ఇది రాష్ట్రంలో బీజేపీకి ఉన్న ప్రస్తుత ఇమేజ్. కానీ, ఒక్కసారిగా కాషాయ దళం మొత్తం కలవరంలో పడింది. పునర్విభజన ప్రక్రియ మొత్తం బీజేపీ మీద కత్తి సాములా మొదలైంది. ఇటు ప్రశాంతంగా ఉండి.. కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయ యుద్ధం చేస్తున్న తరుణంగా ఇరు పార్టీలకు చేరో కత్తి అందిస్తూ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన విభజన వ్యాఖ్యలు మరింత ఆజ్యం పోస్తున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి బీజేపీ బలం పెరుగుతుంది.. బీజేపీకి అధికారం వస్తుందని జెండా పట్టుకుని తిరుగుతున్న వారంతా ఇప్పుడు సైలెంట్ మోడ్‌లో వెళ్లారు. తమ ఆధితపత్యం కోసం ఏదో ఒక విషయాన్ని పట్టుకుని కొట్లాటపెట్టుకుని విమర్శలు చేసుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ కూడా ఇప్పుడు మూకుమ్మడిగా బీజేపీపై దండయాత్రకు దిగాయి.

**గురి తప్పని తేజస్వీ బాణం**

లోక్‌సభలో ప్రసంగిస్తూ తేజస్వీ సూర్య.. ఆంధ్రప్రదేశ్ విభజనను బ్రిటిష్ వారు దేశాన్ని విడగొట్టిన తీరుతో పోల్చారు. కాంగ్రెస్ పార్టీ అత్యంత అశాస్త్రీయంగా, ఘోరంగా రాష్ట్రాన్ని చీల్చిందని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను తక్కువ చేసేలా ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు ఉన్నాయని తెలంగాణ నేతలు మండిపడుతున్నారు. భారత్ పాక్‌లను విడగొట్టినట్లుగా తెలంగాణ విభజన చేసినట్లుగా చెప్పడాన్ని ఖండిస్తున్నారు. లోక్‌సభలో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కాంగ్రెస్ ను విమర్శించే క్రమంలో ఆయన వాడిన పదజాలం, తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను బ్రిటీష్ పాలకులు చేసిన దేశ విభజనతో పోల్చడం.. రాష్ట్ర ప్రజల సెంటిమెంట్‌ను తాకింది. ఈ పరిణామం అటు కేంద్ర బీజేపీకి, ఇటు రాష్ట్ర బీజేపీ నేతలకు మింగుడుపడని అంశంగా మారింది. రాజకీయాల్లో కొన్నిసార్లు ప్రత్యర్థిని దెబ్బకొట్టే క్రమంలో చేసే వ్యాఖ్యలు సెల్ఫ్ గోల్ గా మారుతుంటాయి. తేజస్వీ సూర్య విషయంలో సరిగ్గా ఇదే జరిగింది. కాంగ్రెస్ పార్టీ విభజనను అశాస్త్రీయంగా చేసిందని విమర్శించడం వరకు రాజకీయం అనిపించినా, దానిని బ్రిటీష్ వారు దేశాన్ని ముక్కలు చేసిన తీరుతో పోల్చడం తెలంగాణ ప్రజల దశాబ్దాల పోరాటాన్ని మిగతా 02లో

## లోక్‌సభలో వీగిపోయిన
# మహిళా బిల్లు
### *528 ఓట్లలో 352 తప్పనిసరి, వచ్చినవి 298*
### చివరికి బిల్లు తిరస్కరణ



- విపక్షాల ఏకతాటితో ఎన్డీఏకు భారీ షాక్
- మహిళా బిల్లుకు అందని 'మెజారిటీ' మద్దతు
- విపక్షాల ఐక్యత ముందు తలవంచిన సర్కార్!
- మహిళా బిల్లుతో పాటు డీలిమిటేషన్, యూటీ సవరణ బిల్లులు వెనక్కి

**ముద్ర డెస్క్ :**
దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మారుస్తుందని భావించిన ప్రతిష్ఠాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లు (131వ రాజ్యాంగ సవరణ బిల్లు) లోక్‌సభలో అనూహ్యంగా వీగిపోయింది. కేంద్రం పట్టుదల తో ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో మోదీ ప్రభుత్వానికి భారీ రా జకీయ ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దాల కల నెరవేరుతుందని ఆశించిన మహిళా లోకానికి ఈ పరిణామం నిరాశ మిగిల్చింది.

**ఓటింగ్ సరళి..**

శుక్రవారం లోక్‌సభలో ఉత్కంఠభరిత వాతావరణం మధ్య ఈ బిల్లుపై ఓటింగ్ జరిగింది. సభకు హాజరైన మొత్తం 528 మంది సభ్యుల్లో అనుకూలంగా 298 మంది.. వ్యతిరేకంగా 230 మంది ఓటు వేశారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 352 మంది (2/3 వంతు) సభ్యుల మద్దతు అవసరం. అయితే మ్యాజిక్ ఫిగర్‌కు 54 ఓట్ల దూరంలో బిల్లు నిలిచిపోవడంతో ఇది తిరస్కరించబడినట్లు స్పీకర్ ఓం బిర్లా అధికారికంగా ప్రకటించారు. అనంతరం సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు.

**సర్కారుకు భంగపాటు**

మహిళా రిజర్వేషన్ల అమలుకు ముందు డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) చేపట్టాలనే నిబంధనపై విపక్షాలు మొదటి నుంచీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. 'ఇప్పుడే రిజర్వేషన్లు అమలు చేయకుండా భవిష్యత్తులో ఎప్పుడో జరిగే డీలిమిటేషన్ పేరుతో కాలయాపన చేయడం మహిళలను వంచించడమే' అని విపక్ష నేతలు ధ్వజమెత్తారు. మిగతా 02లో





## సోనియాను రేవంత్ బలిదేవత అనలేదా?
### కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫైర్


- సోనియా నిర్లక్ష్యం వల్లే వెయ్యి మంది బలిదానం
- ఉద్యమాన్ని కించపర్చింది రేవంత్ కాదా?
- ఉద్యమకారులను దేశభక్తులుగా పోల్చుతూ తేజస్వీ ప్రస్తావిస్తే వివాదం

03

## కాళేశ్వరం రిపేర్
### కాళేశ్వరం పనుల కోసం 'స్టీరింగ్ కమిటీ'

- బ్యారేజీల పునరుద్ధరణకు కల్నల్ మెహ్రా కమిటీ
- కాళేశ్వరం మరమ్మతులపై ప్రభుత్వం స్పీడ్
- మే 30లోగా బ్యారేజీలకు కీలక పరీక్షలు

10



## 30 లక్షల మెట్రిక్ టన్నులు బాయిల్డ్ రైస్ సేకరించండి 03

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వినతి



## ఏంటి కథ?



- ఢిల్లీలో రేవంత్ రెడ్డితో టీడీపీ మహిళా నేతల భేటీ
- రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ
- ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసిన పరిటాల సునీత, ఇతర నేతలు
- భిన్న రాజకీయ కూటముల నేతల కలయికపై చర్చ

10

## చెరువులు.. కుంటలు.. హాంఫట్
### పాలమూరులో కబ్జాకోరల్లో జలాశయాలు



- చెరువులను చెరబట్టిన రియల్టర్లు
- బఫర్ జోన్, ఎఫ్ టీ ఎల్ పరిధిలో రియటర్ల భూ దందా
- బీఆర్ఎస్ హయాంలో విచ్చలవిడిగా ఆక్రమణలు
- కాపాడడంలో అధికారులు విఫలం
- ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్న వైనం
- ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం

09

పాలమూరు జిల్లాలో భూమాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. సాగు, తాగు నీరు అందించాల్సిన చెరువులు, కుంటలు అక్రమార్కుల చేతుల్లో బందీలుగా మారాయి. రాజకీయ అండదండలు, అధికారుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువుల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నారు. ముఖ్యంగా ఏనుగొండ సమీపంలోని మోదుగుంట వంటి కీలక జలవనరులను ఎఫ్‌టీఎల్ (FTL), బఫర్ జోన్ నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమించి, ప్లాట్లుగా మార్చి కోట్లు కొల్లగొడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా సాగిన ఈ కబ్జాల పర్వంపై, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం జరుగుతుందని బాధితులు, చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

-ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:

## ప్రజాస్వామ్యమే గెలిచింది
### తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి


- డీలిమిటేషన్ కుట్రను ప్రజాస్వామ్య శక్తులు అడ్డుకున్నాయి
- లోక్‌సభలో వీగిపోయిన131వ రాజ్యాంగ సవరణ బిల్లు

02




## శత్రువులే మిత్రులు..
### డీలిమిటేషన్ సెగతో కలిసిన రాజకీయ ధ్రువాలు
### పునర్విభజనపై రేవంత్, కేటీఆర్ సేమ్ వాయిస్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
కేంద్రం పెట్టిన దక్షిణాధి చిచ్చు దేశం అంతా ఎలా ఉన్నా.. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం రాజకీయ శత్రువులను దగ్గర చేసినట్లుగా మారింది. నిన్నటి వరకు ఏదో ఒక విషయంపై విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకున్న ఈ ఇద్దరు నేతలు ఇప్పుడు కేంద్రానికి వ్యతిరేకంగా ఒక్కటైనట్లుగా మారుతోంది. నియోకజవర్గాల మిగతా 02లో




### ఇదీ AI ముద్ర

మహిళా రిజర్వేషన్ పై లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రధాని మోదీకి, తనకు 'భార్య సమస్య' లేదంటూ సరదాగా చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి.






**పెళ్లికి మానసిక పరిపక్వత**



జీవిత బాధ్యతలు అర్థం చేసుకునే స్థాయి వచ్చిందా అనేది ముఖ్యం. భావోద్వేగంగా స్థిరంగా ఉండాలి.

### లోక్‌సభలో వీగిపోయిన

# మహిళా బిల్లు



(మొదటి పేజీ తరువాయి)
ఓటింగ్ సమయంలో విపక్షాలన్నీ ఏకతాటి పైకి రావడం, ప్రభుత్వం తన మిత్రపక్షాలను కూడా పూర్తిగా ఒప్పించలేకపోవడం ఈ పరాజయానికి కారణంగా కనిపిస్తోంది.

**మరిన్ని బిల్లుల ఉపసంహరణ**

మహిళా బిల్లు పరాజయం పాలైన వెంటనే కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్లతో ముడి పడి ఉన్న డీలిమిటేషన్ బిల్లు–2026, అలాగే కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లులను వెనక్కి తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ఒకదాని వెనుక ఒకటిగా కీలక బిల్లులను ఉపసంహరించుకోవడం ఎన్డీఏ ప్రభుత్వ బలహీనతను సూచిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంలో విపక్షాల ఐక్యత పెరగడం, అధికార పక్ష వ్యూహ వైఫల్యం స్పష్టమైంది. రిజర్వేషన్ల అమలుపై ఉన్న సందిగ్ధత మరింత కాలం కొనసాగే అవకాశం ఉంది. రాబోయే ఎన్నికల్లో మహిళా ఓటర్ల తీర్పుపై ఈ పరిణామం తీవ్ర ప్రభావం చూపవచ్చు.

**ఇక ముందేమిటి?**

మహిళా రిజర్వేషన్ బిల్లు విఫలం కావడం కేవలం ఒక చట్టపరమైన వైఫల్యం మాత్రమే కాదు. ఇది దేశ రాజకీయాల్లో మారుతున్న సమీకరణాలకు అద్దం పడుతోంది. ప్రభుత్వం ఈ అంశంపై మళ్ళీ కొత్త వ్యూహంతో ముందుకు వస్తుందా? లేదా విపక్షాల డిమాండ్ మేరకు డీలిమిటేషన్ నిబంధనను తొలగించి తాజా బిల్లును ప్రవేశపెడుతుందా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఏదేమైనా లోక్‌సభలో చోటుచేసుకున్న ఈ పరిణామాలు దేశవ్యాప్తంగా పెను సంచలనానికి దారితీశాయి.

## ప్రజాస్వామ్యమే గెలిచింది

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేందుకు కేంద్రం పన్నిన డీలిమిటేషన్ కుట్రను ప్రజాస్వామ్య శక్తులు సమర్థవంతంగా అడ్డుకున్నాయని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది కేవలం ఒక బిల్లు వీగిపోవడం కాదు.. సమాఖ్య స్ఫూర్తికి దక్కిన విజయమని పేర్కొన్నారు. శుక్రవారం లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై సీఎం రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో



ఒక పోస్ట్ చేశారు, అందులో కేంద్ర ప్రభుత్వ తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ స్ఫూర్తిని, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుకోవడంలో ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాజ్యాంగ సవరణల పేరుతో దేశ రాజకీయ సమతుల్యతను దెబ్బతీసేందుకు ఏ శక్తులు ప్రయత్నించినా, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వాటిని తిప్పికొడుతుందని ఈ ఓటింగ్ నిరూపించిందని అభిప్రాయపడ్డారు.

**మహిళా కోటాపై స్పష్టత..**

మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని, అయితే వాటిని డీలిమిటేషన్, కులగణనతో ముడిపెట్టి కాలయాపన చేయడాన్ని తాము అంగీకరించబోమని సీఎం స్పష్టం చేశారు. విపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు ఐక్యంగా నిలబడి, తెలంగాణ వంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడారని ఆయన కొనియాడారు. కాగా సీఎం రేవంత్ రెడ్డి మొదటి నుంచీ డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై గళం విప్పుతున్నారు. జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాలను శిక్షించేలా సీట్ల పెంపు ఉండకూడదని ఆయన వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో బిల్లు వీగిపోవడాన్ని ఆయన తన రాజకీయ విజయంగా భావిస్తున్నారు.

## కార్యకర్త నుంచి పార్టీ జనరల్ సెక్రటరీ వరకు

**ముద్ర డెస్క్ :**
ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రంలో తెర వెనుక ఉండి చక్రం తిప్పే వ్యూహకర్తలకు కొదవ లేదు. కానీ కేవలం వ్యూహకర్తగానే కాకుండా ఒక నాయకుడికి నీడలా ఉంటూ నమ్మకానికి నిలువుటద్దంగా నిలిచిన వ్యక్తి కిలారు రాజేష్. సాధారణంగా రాజకీయాల్లో పదవులు, అవసరాల ఆధారంగా బంధాలు ఏర్పడుతుంటాయి. కానీ నారా లోకేష్‌తో రాజేష్‌కు ఉన్న అనుబంధం దశాబ్దాల నాటి స్నేహంపై ఆధారపడి నిర్మితమైంది. నేడు తెలుగుదేశం పార్టీలో జనరల్ సెక్రటరీ స్థాయికి ఆయన ఎదగడం వెనుక ఒక పెద్ద రాజకీయ ప్రయాణమే ఉంది.

**స్నేహం నుంచి వ్యూహకర్త వరకు..**

కిలారు రాజేష్ ప్రయాణం లోకేష్‌తో విద్యార్థి దశలోనే మొదలైంది. వీరిద్దరి మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యమే 2012లో రాజేష్‌ను ప్ర త్యక్ష రాజకీయాల వైపు నడిపించింది. 2014 ఎన్నికల్లో టీడీపీ విజయఢంకా మోగించినప్పుడు యువతను పార్టీ వైపు మళ్లించడంలో రాజేష్ కీలక పాత్ర పోషించారు. లోకేష్ ఐటీ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో, ప్రభుత్వ నిర్ణయాల్లోనూ పార్టీ అంతర్గత వ్యవహారాల్లోనూ రాజే ష్ సలహాలకు అమితమైన ప్రాధాన్యత ఉండేది. ఈ క్రమంలోనే ఆయనను రాజకీయ వర్గాలు 'షాడో మినిస్టర్' అని పిలవడం ప్రారంభించాయి.

**కష్టకాలంలో కొండంత అండ**

రాజకీయాల్లో విజయం ఉన్నప్పుడు అందరూ వెంట ఉంటారు.. కానీ ఓటమి ఎదురైనప్పుడే అసలైన వ్యక్తులు ఎవరో తెలుస్తుంది. 2019లో టీడీపీ ఘోర పరాజయం పాలైన తర్వాత ఆ క్లిష్ట పరిస్థితుల్లో లోకేష్‌కు రాజేష్ కొండంత అండగా నిలిచారు. ముఖ్యంగా చంద్రబాబు అరెస్ట్ సమయంలో పార్టీ అధినేత జైలుకు వెళ్లినప్పుడు ఏర్పడిన శూన్యతను భర్తీ చేస్తూ లోకే ష్‌పై పడిన ఒత్తిడిని తగ్గిస్తూ పార్టీ యంత్రాంగాన్ని సమన్వయం చేయడంలో రాజేష్ ముం దున్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్ చేపట్టిన 3000 కిలోమీటర్ల పైచి లుకు పాదయాత్ర విజయవంతం కావడంలో రాజేష్ పాత్ర వెలకట్టలేనిది. రూట్ మ్యాప్ తయారీ నుంచి స్థానిక నేతలతో సమన్వయం వరకు అంతా తానై వ్యవహరించారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా వివాదాలు రాజేష్‌ను నీడలా వెంటాడాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు, ఓటర్ల డేటా చౌర్యం వంటి ఆరోపణలు ఆయనపై వచ్చాయి. ఈ కేసుల విషయంలో సిట్ విచారణలను కూడా ఆయన ఎదుర్కొన్నారు. విమర్శలు ఎన్ని ఉన్నా, లోకేష్ ఎదుగుదలలో రాజేష్ పాత్రను ఎవరూ కాదనలేరు. ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుంచి పార్టీలో కీలక నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగడం రాజేష్ సమర్థతకు నిదర్శనం.



# కాషాయ కలవరం

(మొదటి పేజీ తరువాయి)
కించపరచడమేనని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు అనేది ఒక చారిత్రక అవసరం, ప్రజా ఆకాంక్ష. దీనిని ప్రతికూల కోణంలో చూడటం ద్వారా బీజేపీ తన పునాదులను తానే దెబ్బతీసుకుంటుందన్న వాదన వినిపిస్తోంది.

**ఏకమైన విపక్షాలు**

ఈ వివాదాన్ని అటు అధికార కాంగ్రెస్, ఇటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ వదులుకోవడానికి సిద్ధంగా లేవు. సాధారణంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకునే ఈ రెండు పార్టీలు, ఇప్పుడు బీజేపీని కార్నర్ చేయడంలో పోటీ పడుతున్నాయి. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తారా అంటూ కేటీఆర్, హరీష్ రావు వంటి బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాలో విరుచుకుపడుతుంటే, మంత్రి పొన్నం ప్రభాకర్ వంటి కాంగ్రెస్ నేతలు క్షేత్రస్థాయిలో నిరసనలకు పిలుపునిస్తున్నారు. తెలంగాణ వ్యతిరేక పార్టీగా బీజేపీని ముద్ర వేయడానికి ఈ వ్యాఖ్యలు ఒక బలమైన ఆయుధంగా మారాయి. దీనిపై హరీష్ రావు తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ఏర్పాటును అవమానించడం బీజేపీకి అలవాటుగా మారింది. గతంలో ప్రధాని మోదీ పార్లమెంటులో తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని అంటే, ఇప్పుడు ఈ ఎంపీ అంతకంటే ఘోరంగా మాట్లాడుతున్నారు అని విమర్శించారు. వందలాది మంది బలిదానాలతో, దశాబ్దాల పోరాటంతో సిద్ధించిన తెలంగాణను బ్రిటిష్ విభజనతో పోల్చడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇటు మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా తేజస్వీ సూర్యపై నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చింది. పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర ఏర్పాటు జరిగింది. దీనిని అశాస్త్రీయం అనడం రాజ్యాంగాన్ని అవమానించడమే అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన మోడల్‌ను విమర్శించే ముందు, దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి కడుతున్న పన్నుల వాటాపై తేజస్వీ సూర్య అవగాహన పెంచుకోవాలని హితవు పలికారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

**బీజేపీ నేతల డిఫెన్స్**

తేజస్వీ సూర్య వ్యాఖ్యలతో రాష్ట్ర బీజేపీ నేతలు అత్యంత క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆయన మాటలను బహిరంగంగా ఖండించలేక, అలాగని సమర్థించలేక సతమతమవుతున్నారు. ఆయన విభజన తీరునే ప్రశ్నించారు తప్ప, తెలంగాణ ఏర్పాటును కాదు అని కొందరు నేతలు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, అది ప్రజల్లోకి వెళ్లడం లేదు. గతంలో పార్లమెంటు సాక్షిగా ప్రధాని మోదీ చేసిన తల్లిని చంపి బిడ్డను వేరు చేశారు అనే వ్యాఖ్యలను ఈ సందర్భంగా విపక్షాలు గుర్తు చేస్తూ, బీజేపీకి మొదటి నుంచి తెలంగాణ అంటే గిట్టదనే వాదనను బలంగా వినిపిస్తున్నాయి. కర్ణాటకకు చెందిన ఎంపీ అయి ఉండి, పొరుగున ఉన్న తెలంగాణ మనోభావాలను దెబ్బతీయడంపై మేధావి వర్గం కూడా పెదవి విరుస్తోంది.

**కవర్ చేసుకోవడమెలా..?**

తెలంగాణలో బలపడాలని చూస్తున్న బీజేపీకి ఇటువంటి అనాలోచిత వ్యాఖ్యలు పెద్ద అడ్డంకులుగా మారుతున్నాయి. సెంటిమెంట్ ప్రధానంగా సాగే తెలంగాణ రాజకీయాల్లో ఏ చిన్న పొరపాటు చేసినా దాని ప్రభావం ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తుంది. తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై జాతీయ నాయకత్వం వెంటనే స్పందించి వివరణ ఇవ్వకపోతే, అది రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీకి పెద్ద మైనస్‌గా మారే అవకాశం ఉంది. రాజకీయ ప్రత్యర్థులను విమర్శించే క్రమంలో ప్రజల మనోభావాలను తాకడం అనేది కత్తి మీద సాము వంటిదని ఈ ఉదంతం మరోసారి నిరూపించింది. మొత్తంగా తేజస్వీ సూర్య వ్యాఖ్యలు తెలంగాణలో బీజేపీకి రాజకీయంగా ఇబ్బందికరంగా మారాయి. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న భయం ఒకవైపు ఉంటే, మరోవైపు తెలంగాణ ఏర్పాటునే తప్పుబట్టేలా మాట్లాడటంపై సర్వత్రా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఏకతాటిపైకి వచ్చి బీజేపీ తీరును ఎండగడుతుండటంతో, రానున్న రోజుల్లో ఈ వివాదం ముదిరేలా కనిపిస్తోంది.

**కత్తి మీద సాములా దక్షిణాది వ్యూహం**

నియోజకవర్గాల పునర్విభజన అంశం భారత రాజకీయాల్లో ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో పెను తుఫానును సృష్టిస్తోంది. జనాభా ప్రాతిపదికన పార్లమెంటు సీట్ల సంఖ్యను పెంచితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. ఈ క్రమంలో, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ సున్నితమైన అంశాన్ని ఎలా డీల్ చేయబోతోంది? దక్షిణాదిలో తన పట్టును పెంచుకోవాలని చూస్తున్న కమల దళం, ఈ దక్షిణాది సెంటిమెంట్'ను ఎలా శాంతింపజేయగలదు?

దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ బలహీనంగా ఉందన్నది కాదనలేని వాస్తవం. కర్ణాటక మినహా మిగిలిన రాష్ట్రాల్లో ఆ పార్టీ తన ఉనికిని చాటుకోవడానికి శ్రమిస్తోంది. ఇలాంటి తరుణంలో, డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే ప్రచారం బలంగా సాగితే, అది ప్రాంతీయ సెంటిమెంట్‌గా మారి బీజేపీకి రాజకీయంగా గండంలా మారుతుంది. తమిళనాడులో స్టాలిన్, తెలంగాణలో రేవంత్ రెడ్డి, కేటీఆర్ వంటి నేతలు ఇప్పటికే దీనిని ఒక అస్తిత్వ పోరాటంగా చిత్రీకరిస్తున్నారు. ఈ సెగను చల్లార్చకపోతే, భవిష్యత్తులో దక్షిణాదిలో విస్తరించాలనే బీజేపీ కల కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికి పార్లమెంటులో సీట్ల సంఖ్యను 816 లేదా 850కి పెంచుతూ బిల్లు తెస్తున్నారు తప్ప ఆ సీట్లను రాష్ట్రాలకు ఏ ప్రాతిపదికన కేటాయిస్తారనే దానిపై స్పష్టమైన ఫార్ములా వెలువడలేదు. జనాభా ప్రాతిపదికన.. పార్లమెంట్ చట్టం ప్రకారం అని చెబుతున్నారు. దీనికోసం కేంద్రం ఒక ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నప్పటికీ, విపక్షాల ఆరోపణలకు సరైన సమాధానం చెప్పకపోవడం వల్ల ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయి. కేవలం జనాభాను మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటే ఉత్తరాది రాష్ట్రాల పెత్తనం పెరుగుతుందనే వాదనకు కేంద్రం గట్టి కౌంటర్ ఇవ్వాల్సి ఉంది. బీజేపీ ఈ అంశాన్ని పార్లమెంటు చర్చ ద్వారా ఒక కొలిక్కి తీసుకువచ్చే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నామనే ముద్ర పడకుండా ఉండేందుకు, కేవలం జనాభానే కాకుండా రాష్ట్రాల సామర్థ్యం, ఆర్థిక తోడ్పాటు వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని కేంద్రం ప్రకటించే ఛాన్స్ ఉంది. పార్లమెంటు వేదికగా ప్రధాని మోదీ , అమిత్ షా వంటి అగ్రనేతలు దక్షిణాదికి భరోసా ఇస్తే తప్ప ఈ ఆందోళనలు సద్దుమణగవు.



### బీజేపీకి దక్షిణ సెంటిమెంట్

భారతదేశం వంటి భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశంలో ఉత్తరాది – దక్షిణాది మధ్య చీలిక రావడం ఏ అధికార పార్టీకి మంచిది కాదు. ముఖ్యంగా ఏక్ భారత్ – శ్రేష్ భారత్ అని నినదించే బీజేపీకి ఇది భారీ దెబ్బ. దక్షిణాది సెంటిమెంట్ పెరిగితే, అది జాతీయవాదానికి గండి కొడుతుందని ఆ పార్టీ అంతర్గత వర్గాలు భావిస్తున్నాయి. అందుకే, సీట్ల పెంపు ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాల గౌరవం తగ్గకుండా, ఒక శాస్త్రీయమైన, ఆమోదయోగ్యమైన ఫార్ములాను తీసుకురావడానికి కేంద్రం కసరత్తు చేస్తోంది. డీలిమిటేషన్ ప్రక్రియ అనేది కేవలం అంకెలకు సం బంధించిన విషయం కాదు, ఇది భారత సమాఖ్య స్ఫూర్తికి ఒక పరీక్ష. నియోజకవర్గాల పునర్విభజన వల్ల ఉత్తరాదికి సీట్లు పెరిగినా, దక్షిణాదికి ఉన్న రాజకీయ ప్రాధాన్యతను కాపాడేలా అదనపు రక్షణ కవచాలు కల్పించడంపై కేంద్రం దృష్టి సారించాలి. త్వ రలో జరగబోయే పార్లమెంటు సమావేశాల్లో ప్రభుత్వం ఇచ్చే స్పష్టతనే దేశ రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. దక్షిణాదికి భరోసా ఇవ్వడంలో కేంద్రం విఫలమైతే, అది దేశ వ్యాప్త రాజకీయ సంక్షోభానికి దారితీసే అవ కాశం ఉంది.

# శత్రువులే మిత్రులు..

(మొదటి పేజీ తరువాయి)
పునర్విభజనను వ్యతిరేకిస్తూ రాజకీయ బద్ధ శత్రువులు సీఎం రేవంత్ రెడ్డి.. మాజీ మంత్రి కేటీఆర్ ఒకే రాగం పాడుతున్నారు. అంతేకాదు.. త్వరలో వీరిద్దరు ఒకే వేదికపై కనిపించే అవకాశాలు కూడా ఉన్నాయి. దక్షిణ నేతలు త్వరలోనే ఒక భారీ మీటింగ్‌కు ప్లాన్ చేస్తున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా నిర్వహించే ఈ సభకు రేవంత్, కేటీఆర్ హాజరుకానున్నట్లు తెలుస్తోంది. దక్షిణాది రాష్ట్రాల తరఫున కేంద్రానికి దక్షిణాది వాణిని బలంగా వినిపించే దిశగా సాగుతున్న ఈ భేటీలో కేటీఆర్, రేవంత్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. పిన్న వయసులోనే కీలక పదవులను అలంకరించిన వీరిద్దరి మధ్య రాజకీయ ఆధిపత్య పోరు కూడా ఓ రేంజిలో సాగుతున్న సంగతి తెలిసిందే. నిత్యం మాటల తూటాలు పేల్చుకుంటున్న ఈ ఇద్దరు నేతలు అనూహ్యంగా ఓ కీలక విషయంపై ఒకే మాటగా ఒకే బాటగా సాగేందుకు నడుం బిగించడాన్ని చూస్తుంటే.. నిజంగానే వీరిద్దరే స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తున్నారు.

**తెలంగాణలో మారిన స్వరం**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య మార్పులకు దారితీస్తోంది. జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందనే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరిదీ ఒకే విధానంగా కనిపిస్తోంది. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై కేటీఆర్ విరుచుకుపడుతుండగా, అటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దక్షిణాది హక్కుల కోసం గళం ఎత్తుతోంది. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన తెలంగాణ వంటి రాష్ట్రాలను సీట్ల పెంపు విషయంలో శిక్షించడం అన్యాయమని కేటీఆర్ అంటున్నారు. ప్రస్తుత పార్లమెంటులో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా ఏ మాత్రం తగ్గకూడదని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఇదే అంశంపై రేవంత్ రెడ్డి కూడా గతంలో ప్రధాని మోదీకి లేఖ రాస్తూ.. దక్షిణాది రాష్ట్రాల గొం





తు నొక్కేలా విభజన ఉండకూడదని స్పష్టం చేశారు. విధానపరంగా ఇద్దరు నేతలు ఒకే తాటిపై ఉన్నప్పటికీ, రాష్ట్రంలోని రాజకీయ సమీకరణాల దృష్ట్యా వీరు కలిసి పోరాడే అవకాశం శూన్యంగా కనిపిస్తోంది.


**టార్గెట్ బీజేపీ**

బీజేపీ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శఇస్తున్నారు. ప్రత్యేక పార్లమెంటు సమావేశాల ఎజెండాపై నమ్మకం లేదని మండిపడ్డారు. 50 శాతం సీట్ల పెంపుపై ఎక్కడా అధికారిక ప్రకటన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం తెలంగాణకు న్యాయం చేస్తారన్న నమ్మకం లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్ర హక్కుల కోసం తాము ఇతర పక్షాలతో కలిసి పోరాడుతామని చెబుతూనే, రేవంత్ రెడ్డిని బీజేపీ ప్రతినిధి గా ముద్ర వేయడం ద్వారా కాంగ్రెస్‌తో కలిసి నడిచే ప్రసక్తే లేదని పరోక్షంగా స్పష్టం చేశారు.

మరోవైపు, కాంగ్రెస్ అధిష్టానం కూడా డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాల ఆవేదనను పరిగణనలోకి తీసుకుంటోంది. అయితే, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రధాన ప్రత్యర్థి కావడంతో, వారితో చేతులు కలిపితే తమ రాజకీయ ఉనికి దెబ్బతింటుందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందుకే, ఇద్దరి లక్ష్యం దక్షిణాది ప్రయోజనాలు అయినప్పటికీ, ఆ క్రెడిట్ ఎవరికి దక్కాలనే విషయంలో నువ్వా –నేనా అన్నట్లుగా పోటీ పడుతున్నారు. ఇది కేవలం సిద్ధాంతాల పోరాటం కంటే పవర్ పాలిటిక్స్ గానే ఎక్కువగా కనిపిస్తోంది. డీలిమిటేషన్ అంశం తెలంగాణలో విచిత్రమైన పరిస్థితిని సృష్టించింది. ఒకే సమస్యపై అధికార, ప్రతిపక్షాలు ఒకే మాట మీద ఉన్నా.. గల్లీలో ఉన్న వైరం వల్ల ఢిల్లీలో గళం కలపలేకపోతున్నాయి. ఒకవేళ కేంద్రం జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే, ఈ ఇద్దరు నేతలు విడివిడిగానే నిరసన గళాలు వినిపిస్తారా లేక రాష్ట్ర ప్రయోజనాల కోసం అనివార్యంగా ఒకే వేదికపైకి వస్తారా అన్నది వేచి చూడాలి. గతంలో తమిళనాడులో స్టాలిన్ నిర్వహించిన సమావేశానికి ఇద్దరు నేతలు హాజరయ్యారు. ప్రస్తుతానికి మాత్రం ఈ కామన్ పాలసీ కేవలం ప్రకటనలకే పరిమితం కానుంది.

**పెళ్లికి ఆర్థిక స్థిరత్వం**

స్థిరమైన ఆదాయం, ఖర్చులు నిర్వహించే సామర్థ్యం ఉండాలి. అప్పుల ఒత్తిడి లేకపో-వడం మంచిది.






## స్కాలర్స్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

**ముద్ర, వనపర్తి:**

ఇంటర్మీడియట్ 2026 ఫలితాల్లో స్కాలర్స్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో బీ. మహాలక్ష్మి 993 మార్కులు, అలీషా సాజి 992, సుస్మిత 991, బాంధవి 999 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. అలాగే ఎంపీసీలో కే.నర్మద 992, కే. శిరీష 991, కే.లలిత 989 మార్కులు సాధించినట్లు తెలిపారు. సీఈసీ లో టి. శ్రావణి 771 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో బైపిసి లో డి. పల్లవి 437, నిమ్రా అఫ్సిన్ 437, అక్షయలక్ష్మి 436, భవ్య శ్రీ 434, యామిని 434, సాత్విక 434, రాజేష్ 434, ఇందు 432, అఖిలాండేశ్వరి 432, గేయ శ్రీ 432, అఖిల 432 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఎంపీసీలో బన్నీ 463 మార్కులు జి.హర్షిత 462, శ్రీ వర్షిని 462, దివ్యశ్రీ 460 మార్కులు సాధించినట్లు తెలిపారు. సీఈసీ లో ముష్కన్ 46 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వీరిని ప్రోత్సహించిన అధ్యాపకులను, అధ్యాపకేతర బృందాన్ని, విద్యార్థుల తల్లిదండ్రులను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ , మధుసూదన్ గుప్తా, డైరెక్టర్లు జగదీశ్వర్, వరప్రసాదరావు, నాగేశ్వర్రెడ్డి సత్యనారాయణరెడ్డి పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు.

# 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించండి

- **5 శాతం నూకతో సరఫరాకు సిద్ధం**
- **పాత బకాయిలు విడుదల చేయాలి**
- **పోషకాహార బియ్యం పంపిణీని పునఃప్రారంభించాలి**
- **కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ వినతి**



**ముద్ర, న్యూ ఢిల్లీ:**

యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ధాన్యం యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలమని వారు కేంద్ర మంత్రికి తెలియజేశారు. గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం, రాష్ట్ర మంత్రి, కేంద్ర మంత్రి జోషిని ఆయన నివాసంలో శుక్రవారం ఉదయం కలిశారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 ఎల్ఎంటీ ధాన్యం ఉత్పత్తి అవుతుందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. తెలంగాణలో పండే యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. ఈ నేపథ్యంలో యాసంగి పంటకు సంబంధించిమొత్తం 30 ఎల్ఎంటీ బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం కేంద్ర మంత్రికి తెలియజేశారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి సీఎం, రాష్ట్ర మంత్రి చేసిన ప్రతిపాదనకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు.

**పాతబకాయిలు చెల్లించాలి :**

201415 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన రూ.1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు తాము చెల్లింపులు చేస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం, రాష్ట్ర మంత్రి తెలియజేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గానూ పోషకాహార బియ్యాన్ని పాఠశాలలు, వసతిగృహాలు, ఐసీడీఎస్‌ల పరిధిలో పంపిణీ చేసేవారని... ఇటీవల దానిని నిలిపివేసినందున వెంటనే దానిని పునః ప్రారంభించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ సింగ్, కేంద్ర ఆహారం, ప్రజా పంపిణీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



## యాదగిరిషుని దర్శించుకున్న అడిషనల్ డీజీపీ

**ముద్ర, యాదగిరిగుట్ట :**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని శుక్రవారం తెలంగాణ అడిషనల్ డీజీపీ కమిషనర్ ఫ్యూచర్ సిటీ ఐపీఎస్ సుధీర్ బాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వయంభూ నరసింహుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపంలో ఉత్సవ మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సురేంద్ర చార్యులు ఆధ్వర్యంలో వేద ఆశీర్వచనం చేయగా సూపరింటెండెంట్ రాజన్ బాబు స్వామివారి లడ్డు ప్రసాదం అందజేశారు. వీరి వెంట యాదాద్రి భువనగిరి ఎస్పీ ఆకాంక్ష యాదవ్ ఉన్నారు.

# ఉద్యమకారులను దేశభక్తులతో పోల్చితే తప్పా?

- **సోనియాగాంధీని బలి దేవత అనలేదా?**
- **తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచింది రేవంత్ ?**
- **ఉద్యమకారులకు వ్యతిరేకంగా తుపాకీ పట్టాడు..**
- **కాంగ్రెస్, బీఆర్ఎస్ పై బండి సంజయ్ ఫైర్**



**న్యూ ఢిల్లీ :**

తెలంగాణ ఉద్యమకారులను దేశభక్తులతో పోలుస్తూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య దేశ విభజన అంశాన్ని ప్రస్తావిస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వివాదం చేయడమేంటని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి ఆనాడు సోనియాగాంధీని బలిదేవత అంటూ తూలనాడిన విషయాన్ని మర్చిపోయారా? అని ప్రశ్నించారు. సోనియాగాంధీ చేసిన నీచమైన పనులతోనే ఆనాడు వెయ్యిమందికిపైగా తెలంగాణ యువకులు చనిపోయారని రేవంత్ రెడ్డి చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి గా ఉంటే... ఆ కేబినెట్ లో మీరెలా మంత్రులుగా ఉన్నారని కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి నిలదీశారు. శుక్రవారం న్యూఢిల్లీలోని తన నివాసంలో బండి సంజయ్ మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై దేశమంతా ఎదురు చూస్తోందని చెప్పిన ఆయన బీజేపీకి ఎక్కడ క్రెడిట్ వస్తుందనే భయంతోనే ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి కుట్రలకు తెరదీశారని విమర్శించారు. బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య నిన్న పార్లమెంట్ లో మాట్లాడుతూ రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పిదాలతోనే వందలాది మంది తెలంగాణ యువకులు బలిదానం చేశారని చెబుతూ దేశ విభజన అంశాన్ని ప్రస్తావించారన్నారు. అంతే తప్ప ఆయన తెలంగాణను అవమానించలేదన్నారు. ఎందుకంటే దేశ విభజన విషయంలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పిదాలతోనే లక్షల మంది చనిపోయిన మాట నిజం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ తప్పిదాలతోనే 1400 మంది యువకులు బలిదానమైంది ముమ్మాటికీ వాస్తవం అన్నారు. 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి... సీమాంధ్ర నేతల ఒత్తిడితో కాంగ్రెస్ పార్టీ యూ టర్న్ తీసుకున్నది నిజం కాదా? అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్‌లోనే కదా?.... ఆ రేవంత్ రెడ్డే సోనియాగాంధీని బలిదేవత అనలేదా? సోనియాగాంధీ చేసిన నీచమైన పనులతోనే తెలంగాణలో వందల మంది చనిపోయారని అనలేదా? అన్నారు. ఆనాడు తెలంగాణ రణభేరి నిర్వహిస్తుంటే అందుకు వ్యతిరేకంగా తుపాకీ పట్టుకుని నిలబడ్డ నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు.

రాష్ట్ర ప్రజలకు 6 గ్యారంటీల పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతగాక కాంగ్రెస్ పార్టీ, 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అవినీతి బయటకు రాకుండా బీఆర్ఎస్ నేతలు రోజుకో అంశాన్ని వివాదం చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే అని ఆరోపించారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యమకారులు ఎటు పోయారు? వాళ్ల బతుకులు ఎందుకు మారలేదని నిలదీశారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ మాటలు నమ్మి మోసపోవద్దని తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మొదటి నుండి చిత్తశుద్ధితో పనిచేసిన ఏకైక జాతీయ పార్టీ బీజేపీయే అన్నారు. చిన్న రాష్ట్రాలకు వ్యతిరేకమని కాంగ్రెస్ బాహాటంగా ప్రకటించిన సమయంలోనే 'కాకినాడ తీర్మానం పేరుతో ఒక ఓటు రెండు రాష్ట్రాలని తీర్మానం చేసింది బీజేపీ నిజం కాదా? అని ప్రశ్నించారు. ఆనాడు నిండు పార్లమెంట్ లో కాంగ్రెస్ సీమాంధ్ర ఎంపీలు తెలంగాణను వ్యతిరేకిస్తూ... బిల్లు కాపీలను చింపి పారేసి పెప్పర్ స్ప్రే చల్లి సభలో నానా హంగామా చేసి సభను వాయిదా వేయించాలని చూస్తే.... ఆ కుట్రలను అడ్డుకుని తెలంగాణ బిల్లును ఆమోదింపజేసింది బీజేపీ కాదా?...మీరా బీజేపీ చిత్తశుద్ధి గురించి మాట్లాడేది అన్ని అన్నారు.



## తొందరలోనే బీసీ రాజ్యాధికారం

- **పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**

తొందరలోనే బీసీ రాజ్యాధికారం అందిస్తామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో పూలె దంపతులకు పూలమాలలు వేశారు. అనంతరం టీఆర్పీ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జెండా ఆవిష్కరణలో ముందుందని, పార్టీ సిద్ధాంతాలను, భావజాలాన్ని నమ్మి చేరుతున్న ప్రతి ఒక్కరికీ తొందరలోనే బీసీ రాజ్యాధికారం అందిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం మన లెక్కలను తప్పుడు లెక్కలుగా చిత్రీకరించిన విషయం బయటపెట్టడానికి ప్రధాన కారణం తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలమేనని, బీసీల చైతన్యమేనని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పసల ప్రసన్న మాట్లాడుతూ బీసీల కోసం ఒక బలమైన వేదిక తెలంగాణ రాజ్యాధికార పార్టీ అని స్పష్టం చేశారు. జిల్లా నాయకులు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బందారపు నైస్ నరసయ్య గౌడ్, కోఆర్డినేటర్ లింగం యాదవ్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు నరసింహులు పాల్గొన్నారు.




## ఉప్పల్ మెట్రో స్టేషన్ కు బాంబు బెదిరింపు

- **రెండు ఫ్లాట్ ఫామ్‌ల్లోనూ సోదాలు**
- **ఫేక్ కాల్ అని నిర్ధారించిన పోలీసులు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఉప్పల్ మెట్రో స్టేషన్ లో ప్రయాణికులంతా ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురయ్యారు. ఆ మెట్రో స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి చెప్పారు. దీంతో సిబ్బంది అప్రమత్తమైంది. వెంటనే బాంబ్ స్క్వా డ్ సిబ్బందికి సమాచారం అందించారు. ఈ మేరకు ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు బాంబ్ స్క్వాడ్ సిబ్బంది చేరుకుంది. స్టేషన్ మొత్తాన్ని ఆధీనంలోకి తీసుకుంది. అనుమానం వచ్చిన ప్రతి చోట క్షుణ్ణంగా పరిశీలన చేసింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తనిఖీలు చేసింది. ఇరువైపులా రెండు ఫ్లాట్ ఫామ్‌ల్లోనూ సోదాలు చేసింది. ప్రయాణికులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సి అవసరం లేదని తెలిపింది. అయితే బెదిరింపు కాల్ చేసింది ఎవరేనే కోణంలో పోలీసులు, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది విచారణ చేపట్టింది. నిందితులెవరైనా సరే ఇలాంటి కాల్స్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

# విషం కక్కుతున్న బీజేపీ..

- **ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలపై బిజెపి తన వైఖరి స్పష్టం చేయాలి**
- **రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడం బిజెపికి ఏమాత్రం ఇష్టం లేదని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి ఆరోపించారు. అందుకే అవకాశం దొరికిన ప్రతి సందర్భంలోనూ తెలంగాణ ఏపీ విభజనపై ఆ పార్టీ విషం కక్కుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏపీ రాష్ట్రాల విభజనను భారత్ పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ బిజెపి ఎంపి తేజస్వి సూర్య వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం అన్నారు.శుక్రవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు.బిజెపికి ప్రజాస్వామ్యం, పార్లమెంట్ వ్యవస్థపై గౌరవం లేదన్నారు. అందుకే బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై నిస్సిగ్గుగా విషం కక్కుతూనే ఉన్నారని పేర్కొన్నారు.మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని మొదలు పెట్టిన తనకు.. ప్రస్తుతం బిజెపి అవలంబిస్తున్న ధోరణితో తన రక్తం మరుగుతోందని చిన్నారెడ్డి అన్నారు.స్వరాష్ట్రం తెలంగాణ కోసం ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, మేధావులు ఉద్యమించారని చెప్పారు, ఈ ఉద్యమాలను గౌరవించి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ప్రజాస్వామికంగా పార్లమెంటు ఆమోదంతో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని వివరించారు. అంతకు ముందే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ తాను 41 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంతకాలను సేకరించి సోనియా గాంధీతో 2000లోనే భేటీ అయ్యానని గుర్తు చేశారు. ఆ తర్వాత తెలంగాణ మలిదశ ఉద్యమం ఊపందుకుందని చిన్నారెడ్డి పేర్కొన్నారు.బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర విభజనను కించపరుస్తూ మాట్లాడిన సందర్భంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు, మిగతా ఆరుగురు బిజెపి ఎంపీలు చోద్యం చూస్తూ కూర్చున్నారే తప్ప వ్యతిరేకించలేదని చిన్నారెడ్డి విమర్శించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన తేజస్వీ సూర్యకు తెలంగాణ అంశానికి సంబంధం ఏమిటీ అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రస్తావన అవసరం ఎందుకు అని నిలదీశారు.ప్రధాని నరేంద్ర మోడీ కూడా గతంలో తెలంగాణ విభజనకు వ్యతిరేకంగా మాట్లాడారని, తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని మోడీ చెప్పారని, బిజెపి ముమ్మాటికి తెలంగాణ వ్యతిరేకి అని మరోసారి రుజువైందని చిన్నారెడ్డి అన్నారు.బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకు వెంటనే బేషరతుగా పార్లమెంట్ లోనే క్షమాపణ చెప్పాలన్నారు, తెలంగాణ రాష్ట్రం పట్ల బిజెపికి ఉన్న వైఖరిని స్పష్టం చేయాలని చిన్నారెడ్డి డిమాండ్ చేశారు.

## రోడ్డు భద్రత – ప్రతి ఒక్కరి బాధ్యత : డీజీపీ

**ముద్ర, కరీంనగర్ :**



కరీంనగర్‌లో నిర్వహించిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో డీజీపీ బి. శివధర్ రెడ్డి రోడ్డు భద్రతను సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యస్థానానికి చేరుకోవడం ముఖ్య లక్ష్యమని ఆయన తెలిపారు. రాష్ట్రంలో నేరాల కంటే రోడ్డు ప్రమాదాలే ఎక్కువ ప్రాణ నష్టం కలిగిస్తున్నాయని, గతేడాది వేలాది మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని గుర్తుచేశారు.. కేవలం కరీంనగర్ లో ఇప్పటివరకు 600 వరకు అవగాహనా కార్యక్రమాలు నిర్వ హించామన్నారు. అనంతరం పలువురికి హెల్మెట్లు అందజేశారు. అరైవ్ అలైవ్ కి సంబంధించిన స్కై బెలూన్ పాట సీడీని డీజీపీ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్ అశ్విని, డీఎం హెచ్ ఓ వెంకటరమణ , ఎంవీఐ చక్రవర్తి , ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ తో పాటు ఇతర అధికారులు ,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు




సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శనివారం 18.04.2026



# వేదిక
Peoples Voice

మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు,సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

అమ్మాయిలూ జాగ్రత్త...

# ధైర్యమే మీ రక్షణ!

**మోసాలకు బలికాకండి... తెలివితో మీ భవిష్యత్తును కాపాడుకోండి!**




**నల్గొండ :**
ప్రస్తుత కాలంలో అమ్మాయిలు మోసపోతున్నారు అనాలా? లేక మోసగించబడుతున్నారు అనాలా? అనే ప్రశ్న మన ముందుకు వస్తోంది. ఒక్కసారి మనం ఆలోచిస్తే, అమ్మాయిలు ధైర్యంగా, తెలివిగా ఉంటే తమను తాము కాపాడుకోవడం సాధ్యమే. అయితే ఎందుకు కొంతమంది మృగాల్లా ప్రవర్తించే పురుషుల చేతిలో మోసపోతున్నారు అనే విషయం మనం పరిశీలించాలి.
మనలను మనం కాపాడుకునే శక్తి ప్రతి ఒక్కరిలో ఉంటుంది. క్లిష్ట పరిస్థితులు వచ్చినప్పుడు ఆ శక్తిని బయటకు తీసి ధైర్యంగా నిలబడాలి. "ఎవరో వచ్చి కాపాడతారు" అని ఎదురు చూడటం మూర్ఖత్వం. తెలిసీ తెలిసీ కొందరు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.
నిజమైన ఆనందం సినిమా చూడటంలోనో, బేకరీలకు వెళ్లటంలోనో ఉండదు. మన విలువను మనం గుర్తించిన రోజే నిజమైన ఆనందం లభిస్తుంది. ఈ శతాబ్దంలో సాంకేతికంగా ఎంతో అభివృద్ధి జరిగినప్పటికీ, ఇంకా మహిళలపై దాడులు, హత్యలు వంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయి అనే ప్రశ్న మన ముందుంది. లోపాలు ఎవరిలో ఉన్నాయో, ఎవరిని నిందించాలో ఒక్కసారి ఆలోచించాలి.
ఒక్కరినే నిందించడం సరిపోదు. మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో నేర్చుకోవాలి. తప్పు జరగకుండా మన శక్తి మేరకు పోరాడాలి. ఆ పోరాటంలో ధైర్యంగా నిలబడటం చాలా అవసరం. ఎందుకంటే నరరూప రాక్షసుడి చేతిలో బలయ్యే కంటే, ధైర్యంగా పోరాడటం ఎంతో మంచిది.
అమ్మాయిలు తమ బాధ్యతగా ఇంట్లో ఉన్న అన్నదమ్ములకు, తండ్రికి కూడా సమాజంలో మహిళల పట్ల ఎలా ప్రవర్తించాలో చెప్పాలి. మనం ఏ పని చేయడానికి ముందూ ఒకటికి రెండు సార్లు ఆలోచించాలి. మన కుటుంబ నేపథ్యం ఏమిటి, మన తల్లిదండ్రులు ఎంత కష్టపడి మనల్ని చదివిస్తున్నారో గుర్తు పెట్టుకుంటే తప్పు నిర్ణయాలకు దూరంగా ఉండవచ్చు.
ప్రతిరోజూ పత్రికల్లో అమ్మాయిలపై దాడులు, హత్యలు వంటి వార్తలు చదువుతూనే ఉంటాం. అయితే అవి ఎందుకు జరుగుతున్నాయి అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. అలాంటి పరిస్థితి మనకే వస్తే మనం ఏమి చేయగలమో ముందుగానే ఆలోచించాలి. మనలను మనం ఎలా కాపాడుకోవాలో తెలుసుకోవాలి.
ఇప్పటి కాలంలో టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందింది. అయితే దాన్ని చెడు పనులకు కాకుండా మంచి పనులకు ఉపయోగించుకోవాలి. ఎవరినైనా అతి నమ్మకం పెట్టుకోవద్దు. ప్రతి క్షణం మనం చేసే పని మంచిదా చెడ్డదా అని ఆలోచిస్తే అనేక సమస్యలను నివారించవచ్చు.
అమ్మాయిలు పనికిరాని విషయాలు మాట్లాడటం కంటే, సమాజంలో జరుగుతున్న విషయాల గురించి చర్చించాలి. "ఈ రోజు వాళ్లకు జరిగింది, రేపు మనకూ జరగవచ్చు" అనే ఆలోచన కలిగి ఉండాలి. అందుకు మనం ఎలా సిద్ధంగా ఉండాలో తెలుసుకోవాలి.
ఈ రోజుల్లో చాలా మంది "బెస్ట్ ఫ్రెండ్" అంటారు. కానీ నిజమైన సమస్యలు చెప్పుకోరు. స్నేహితుడు పిలిచాడని ఎవరికి తెలియకుండా వెళ్లడం మంచిది కాదు. నమ్మకమైన వారితో విషయాలు పంచుకుంటే అనర్థాలు చాలా వరకు తగ్గుతాయి.
ప్రతి సందర్భంలో ఎదుటివారినే తప్పుపట్టడం కాకుండా, మన వైపు నుంచి మనం ఎంత నిజాయితీగా ఉన్నామో కూడా ఆలోచించాలి. "ఎవరికో జరిగింది, మనకు ఎందుకు?" అని నిర్లక్ష్యం చేయకుండా, "మన ఇంట్లోనే జరిగితే?" అనే భావన ప్రతి ఒక్కరిలో కలిగితే సమాజంలో మార్పు తప్పకుండా వస్తుంది.

**-- డాక్టర్ బోయపల్లి చిట్టమ్మ**



# దక్షిణాది గొంతు నొక్కే పన్నాగం పటాపంచలు..

**కేంద్రానికి ముచ్చెమటలు పట్టించిన ఓటింగ్! - సీట్ల పెంపు కుట్రపై ప్రజాస్వామ్య విజయం!**



భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో అహంకారానికి, రాజ్యాంగ ధిక్కారానికి లభించిన గట్టి చెంపదెబ్బ ఇది. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను ఏకంగా 850కి పెంచి, దేశ రాజకీయ ముఖచిత్రాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలన్న కేంద్ర ప్రభుత్వ దుష్ట సంకల్పం లోక్‌సభ సాక్షిగా కుప్పకూలింది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం అనేది కేవలం ఒక సాంకేతిక ఓటమి మాత్రమే కాదు; సమాఖ్య స్ఫూర్తిని స్మశానవాటికకు పంపాలని చూసిన పాలకుల కుట్రపై ప్రజాస్వామ్యం సాధించిన అఖండ విజయం. 278 ఓట్లతో ప్రభుత్వం ఆధిక్యంలో ఉన్నట్లు భ్రమపడినా, రాజ్యాంగ సవరణకు అవసరమైన 326 ఓట్ల మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోలేక ఢిల్లీ పీఠం చతికిలపడటం పాలకుల వ్యూహాత్మక దివాళాకోరుతనానికి నిదర్శనం. సభలో ఉన్న 489 మంది సభ్యుల్లో మూడింట రెండు వంతుల మద్దతు కూడగట్టలేకపోవడం అంటే, దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే అంశంపై ప్రభుత్వం ఎంతటి అపరిపక్వతతో, ఎంతటి మొండితనంతో వ్యవహరించిందో అర్థమవుతోంది.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బిల్లు వెనుక అత్యంత హేయమైన రాజకీయ కుట్ర దాగి ఉంది. దశాబ్దాలుగా జనాభాను నియంత్రిస్తూ, క్రమశిక్షణతో అభివృద్ధి చెందుతున్న దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాబల్యాన్ని తుడిచిపెట్టడమే ఈ పన్నాగం అసలు ఉద్దేశం. ఉత్తరాదిలో ఓట్ల వేట కోసం జనాభా విస్ఫోటనాన్ని వరంగా మార్చుకుని, దేశాన్ని భౌగోళికంగా రెండుగా విభజించాలనే పాలకుల వికృత చేష్టలకు పార్లమెంటు అడ్డుకట్ట వేసింది. అభివృద్ధిని శిక్షించి, అరాచక పెరుగుదలకు పట్టం కట్టే ఈ ప్రతిపాదన దేశ సమగ్రతకు గొడ్డలిపెట్టు వంటిది. ఢిల్లీ గద్దెపై కూర్చున్న పాలకులు తామేదో సర్వాధికారులమని, రాష్ట్రాలను తమ సామంత రాజ్యాలుగా మార్చుకోవచ్చని భావించడం వారి అజ్ఞానానికి పరాకాష్ట. జనాభా పెరిగితే సీట్లు పెరుగుతాయన్న సూత్రం, నిజానికి దేశాభివృద్ధికి సహకరించిన రాష్ట్రాలను రాజకీయంగా నిర్వీర్యం చేయడమే అవుతుంది. ఈ వివక్షా పూరిత వైఖరిని పసిగట్టిన విపక్షాలు ఏకతాటిపైకి వచ్చి కేంద్రం పన్నాగాలను చిత్తు చేశాయి.

పార్లమెంటరీ వ్యవస్థలో ఏదైనా ఒక రాజ్యాంగ సవరణ తీసుకువచ్చేటప్పుడు అన్ని పక్షాలను కలుపుకొని పోవడం, ఏకాభిప్రాయం సాధించడం కనీస ధర్మం. కానీ, ప్రస్తుత ప్రభుత్వం మదగజంలా వ్యవహరిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కి, ఏకపక్షంగా రాజ్యాంగాన్ని తమ ఇంటి పత్రంలా మార్చుకోవాలని చూసింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్‌లో బయటపడిన గణాంకాలు ప్రభుత్వ అసమర్థతను, పార్లమెంటరీ ప్రక్రియపై వారికి ఉన్న లక్ష్యశుద్ధి లేమిని ఎండగట్టాయి. ఓటింగ్‌కు అవసరమైన 326 ఓట్లు లేవని తెలిసి కూడా బిల్లును నెట్టాలని చూడటం అంటే, చట్టసభను ప్రభుత్వం ఒక రబ్బరు స్టాంపులా భావిస్తోందని స్పష్టమవుతోంది. 211 మంది సభ్యులు ఈ బిల్లును వ్యతిరేకించారంటే, అది కేవలం రాజకీయ వ్యతిరేకత కాదు; దేశ భౌగోళిక, రాజకీయ సమతుల్యతను తలకిందులు చేయవద్దని ఇచ్చిన గంభీర హెచ్చరిక.

ఈ పరాభవం తర్వాతైనా కేంద్రం తన మొండి వైఖరిని, నిరంకుశ పోకడలను వీడాలి. 850 సీట్లకు పెంచి కొత్త పార్లమెంటు భవనంలో తమ బానిసలను నింపుకోవాలనుకున్న పాలకులకు, ప్రజాస్వామ్య వ్యవస్థ గట్టి ముచ్చెమటలు పట్టించింది. నియోజకవర్గాల పునర్విభజన అనేది కేవలం అంకెల గారడీ కాదు, అది దేశ సార్వభౌమత్వానికి సంబంధించిన సున్నితమైన అంశం. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను పణంగా పెట్టి, కేవలం ఓట్ల రాజకీయాల కోసం దేశ పునాదులను కదిలించే సాహసం చేస్తే ఫలితం ఇలాగే అవమానకరంగా ఉంటుందని తేలిపోయింది. అంకెల గారడీతో అధికారాన్ని శాశ్వతం చేసుకోవచ్చనే భ్రమలో ఉన్న పాలకులకు, ఈ ఓటింగ్ ఫలితం ఒక మరణశాసనం. విపక్షాలు చూపిన ఈ ఐక్యత ప్రజాస్వామ్యానికి ఒక రక్షణ కవచంలా నిలిచింది. సంఖ్యాబలం అనేది అహంకారానికి చిహ్నం కాకూడదని, అది బాధ్యతాయుతమైన పాలనకు పునాది కావాలని ఈ పరిణామం గుర్తు చేస్తోంది.

నిజానికి పరిపాలనా సంస్కరణలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, చీకటి గదుల్లో కుట్రలు చేయడం మానేసి రాష్ట్రాల ముఖ్యమంత్రులతో, మేధావులతో ముఖాముఖి చర్చలు జరపాలి. ఏ ప్రాతిపదికన సీట్లను పెంచుతున్నారో, దానివల్ల ఏ రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందో సమాధానం చెప్పలేని పిరికితనం ప్రభుత్వానిది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు పతనం భారత ప్రజాస్వామ్యం ఇంకా సజీవంగా ఉందనడానికి, రాజ్యాంగం ఇంకా నియంతల చేతుల్లో బందీ కాలేదనడానికి సజీవ సాక్ష్యం. సంఖ్యాబలం ఉందన్న అహంకారంతో రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కాలని చూస్తే, పార్లమెంటు గోడలే పాలకులను బహిష్కరిస్తాయని ఈ రోజు రుజువైంది. ప్రజల గొంతును నొక్కే ప్రయత్నం చేస్తే ఫలితం ఇలాగే ఉంటుందని ఈ ఓటింగ్ ఫలితం తేల్చిచెప్పింది. సీట్ల సంఖ్యను పెంచడం ద్వారా తమ రాజకీయ లబ్ధిని వెతుక్కునే ప్రయత్నంలో, ప్రభుత్వం దేశ పునాదులను కదిలించే సాహసం చేస్తోంది.

ముగింపుగా, ఢిల్లీ పాలకులు గుర్తుంచుకోవాలి అధికారం అనేది శాశ్వతం కాదు, కానీ మీరు చేసే ద్రోహం చరిత్రలో శాశ్వతంగా ఉండిపోతుంది. సీట్ల పెంపు పేరుతో మీరు ఆడిన ఈ అపవిత్ర క్రీడలో ప్రజాస్వామ్యమే విజేతగా నిలిచింది. ఈ ఓటమి పాలకులకు ఒక నిరంతర పీడకలగా మిగిలిపోవాలి. ఇప్పటికైనా వినాశకరమైన ఆలోచనలను విడనాడి, దేశ సమైక్యతను గౌరవించకపోతే, రాబోయే రోజుల్లో ప్రజలు మిమ్మల్ని చరిత్ర పుటల నుంచి తుడిచిపెట్టడం ఖాయం. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడం అనేది భారత ప్రజాస్వామ్యం ఇంకా సజీవంగా ఉందనడానికి నిదర్శనం. ఇది కేవలం ఒక బిల్లు ఓటమి కాదు, ప్రజాస్వామ్య పీఠంపై పడగనీడలా మారిన నిరంకుశత్వానికి అంత్యక్రియల ప్రారంభం. పాలకుల తీరు మారుతుందో లేదో కాలమే నిర్ణయించాలి, కానీ ప్రజలు మాత్రం అప్రమత్తంగా ఉండాలి.

**- వెంక గారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**



# క్రియేటివిటీని మింగేస్తోన్న 'ఏఐ'

**■ ఏఐ దెబ్బకు అక్షరాలకు ఆపద ■ కంటెంట్ రంగంలో యంత్రాల దూకుడు.. రైటర్లకు ముప్పు**

నేడు అక్షరం ఒక యంత్రం చేతిలో బందీ అవుతోంది. భావం ఒక అల్గారిథమ్ లెక్కల్లో చిక్కుకుపోతోంది. ఒకప్పుడు కలం పడితే కాగితం మీద ఆలోచనలు నాట్యం చేసేవి. ప్రతి వాక్యంలో ఒక వ్యక్తిత్వం.. ప్రతి పదంలో ఒక అనుభూతి కనిపించేవి. కానీ నేడు డిజిటల్ యుగంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) అనే ఒక మాయాజాలం కంటెంట్ రైటింగ్ రంగాన్ని కబళిస్తోంది. సౌకర్యం అనే ముసుగులో సృజనాత్మకతను నిలువునా గొంతు నులుముతోంది.



**అంకెల్లో విషాదం.. ఆవిరవుతున్న ఉద్యోగాలు**

తెలుగు మీడియా రంగం గత కొన్ని నెలలుగా ఒక నిశ్శబ్ద యుద్ధాన్ని ఎదుర్కొంటోంది. కేవలం అంచనాల ప్రకారమే.. తెలుగు మీడియా రంగంలో వెబ్ సైట్లు, పత్రికలు, న్యూస్ పోర్టల్స్, న్యూస్ చానెల్స్ లో సుమారు 150 మందికి పైగా నైపుణ్యం కలిగిన రైటర్లు తమ ఉద్యోగాలను కోల్పోయారు. ఇది కేవలం ఒక అంకె మాత్రమే కాదు.. 150 కుటుంబాల జీవనాధారం. వేగంగా కంటెంట్ కావాలి.. తక్కువ ఖర్చుతో పని జరగాలి అనే కార్పొరేట్ ధోరణికి ఏఐ ఒక అస్త్రంగా దొరికింది. పది మంది చేసే పనిని ఒక సాఫ్ట్‌వేర్ క్షణాల్లో పూర్తి చేస్తుంటే.. యజమాన్యాలకు మానవ రచయితల 'భావోద్వేగాలు'.. 'సృజనాత్మకత' అనవసరమైన భారంగా కనిపిస్తున్నాయి.

**సోమరితనపు సంకెళ్లు.. ఆలోచనా శక్తికి గ్రహణం**

**ఏఐ ఇస్తున్న అతిపెద్ద ముప్పు ఉద్యోగాల కోత మాత్రమే కాదు.. అంతకు మించి రచయితల స్వతంత్ర ఆలోచనా శక్తి క్షీణించడం. ఒకప్పుడు ఒక కథనం రాయాలంటే గంటల తరబడి మేధోమథనం చేసేవారు. ఇప్పుడు కేవలం ఒక 'ప్రాంప్ట్' ఇస్తే చాలు.. నిమిషాల్లో పేజీల కొద్దీ మేటర్ వచ్చేస్తోంది. దీనికి అలవాటు పడిన మెదడు క్రమంగా తన పదును కోల్పోతోంది. ఏఐ రాసే భాషలో వ్యాకరణం ఉండొచ్చు కానీ.. 'ఆత్మ' ఉండదు. చదువుతుంటే అది ఒక మనిషి రాసినట్టు కాకుండా ఒక యంత్రం పేర్చిన ఇటుకల్లా కనిపిస్తోంది. ఒక రచయితకు ఒక శైలి ఉంటుంది. కానీ ఏఐ అవుట్‌పుట్‌లో అందరిదీ ఒకే గొంతు.. ఒకే ధోరణి.**

**గుర్తిస్తున్న సంస్థలు.. కఠినమవుతున్న నిబంధనలు**

కంటెంట్ క్రియేటర్లు తాము ఏఐ వాడుతున్న విషయం ఎవరికీ తెలియదు అనుకుంటే అది భ్రమ మాత్రమే. సంస్థలు ఇప్పుడు ఏఐ కంటెంట్‌ను పసిగట్టే టెక్నాలజీని వాడుతున్నాయి. భావ పునరావృతం, భావోద్వేగం లేని వాక్య నిర్మాణం, వ్యక్తిగత విశ్లేషణ లోపించడం వంటి అంశాలు రైటర్ల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తున్నాయి. "ఒక్కసారి ఏఐకి బానిస అయితే.. ఆ రచయిత మళ్ళీ తిరిగి తన సొంత శైలిని తట్టి లేపలేడు" అన్న చేదు నిజం ఇప్పుడు మీడియా రంగంలోని పెద్దలను కఠిన నిర్ణయాలు తీసుకునేలా చేస్తోంది.

**ఏఐ.. సేవకుడిగా ఉండాలి కానీ యజమానిగా కాదు..**

ఏఐ అనేది ఒక అద్భుతమైన పరిశోధనా సాధనం. డేటా సేకరించడానికి.. కొత్త ఐడియాల కోసం.. వ్యాకరణ దోషాలను సరిదిద్దుకోవడానికి దీన్ని వాడటం తప్పు లేదు. కానీ ఆ కంటెంట్‌లో ప్రాణం పోయాల్సింది మాత్రం రచయిత మాత్రమే.
ఏఐ సమాచారాన్ని ఇస్తుంది.. కానీ దానికి భావోద్వేగాన్ని మనిషి మాత్రమే ఇవ్వగలడు. గూగుల్‌లో దొరకని నిజాలను.. క్షేత్రస్థాయి పరిశీలనలను మీ రచనల్లో చేర్చండి. మీ అక్షరం చూస్తే ఇది ఫలానా వ్యక్తి రాశారు అని పాఠకుడు గుర్తించేలా మీ సంతకాన్ని నిలబెట్టుకోండి.

**అక్షరమే ఆయుధం కావాలి**

సాంకేతికత ఎంత పెరిగినా మనిషి హృదయానికి ఉండే స్పందన యంత్రానికి ఉండదు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే కంటెంట్ రైటర్లు తమను తాము అప్‌డేట్ చేసుకోవాలి. ఏఐని ఒక ప్రత్యర్థిగా చూసి భయపడటం మానేసి.. దాన్ని ఒక సహాయకుడిగా మార్చుకోవాలి. యంత్రం కన్నా వేగంగా కాకపోయినా.. యంత్రం కన్నా ప్రభావవంతంగా రాయగలిగినప్పుడే అక్షరానికి గౌరవం.. రచయితకు భవిష్యత్తు ఉంటుంది.

గుర్తుంచుకోండి.. టెక్నాలజీ మారుతుంది.. కానీ తర్కం మారనిది ఒక్కటే సృజన ఎప్పుడూ సజీవంగానే ఉండాలి.. అది యంత్రానికి లొంగిపోకూడదు.



సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

శనివారం 18.04.2026

www.mudranews.in | @mudranews





**పెళ్లికి వ్యక్తిగత లక్ష్యాలు**

కెరీర్, చదువు, వ్యక్తిగత ఆశయాలు పూర్తయ్యాయా? లేకపోతే పెళ్లి తరువాత అవి ప్రభావితమవుతాయి.

## సంక్షిప్తంగా..

### చలివేంద్రం ఏర్పాటు




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సమీపంలోని పెట్రోల్ బంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాటసారులు, కార్మికులు, సాధారణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. వేసవి కాలం ముగిసే వరకు నిరంతరాయంగా తాగునీరు అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. అలాగే పక్షుల దాహార్తి తీర్చేందుకు మట్టి పాత్రల్లో నీటిని ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలు కూడా తమ ఇళ్ల ఆవరణల్లో, మేడలపై పక్షుల కోసం నీరు ఉంచాలని పిలుపునిచ్చారు.


### సమస్యల పరిష్కారానికే వార్డుల సందర్శన



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సమస్యలు నేరుగా తెలుసుకుని, తద్వారా పరిష్కరించేందుకే వార్డుల సందర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్ తెలిపారు. శుక్రవారం ఉదయం గద్వాల మున్సిపాలిటీ లో 16వ వార్డు కౌన్సిలర్ వేదావతి వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. భీంనగర్, రెవెన్యూ కాలనీ, తదితర కాలనీలో సమస్యలపై ఆరా తీశారు. పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ కాలువల నిర్మాణాలపై స్థానిక కౌన్సిలర్, నాయకులతో కలిసి సమీక్షించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సహకారంతో భీంనగర్, రెవెన్యూ కాలనీలో పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. అలాగే వార్డులో అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలను కాపాడుతామని హామీ ఇచ్చారు. అలాగే కృష్ణానది మెయిన్ రోడ్డుకు ఆక్రమించుకొని నిర్మించిన ఇండ్ల నిర్మాణాలను తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జానకిరామ్ సాగర్, నాయకులు నాగ శంకర్, సుంకన్న, మధు, మధు ముదిరాజు, తిరుమల్ రెడ్డి, వీరేష్, సత్యం, వార్డు ఆఫీసర్లు, జవాన్ పాల్గొన్నారు.

### నిబంధనల మేరకే లేఅవుట్ల అనుమతులు

-కలెక్టర్ ప్రతీక్ జైన్



**ముద్ర, నారాయణ పేట :** ప్రభుత్వ నిబంధనలను అనుసరించి లే – అవుట్ లకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ లే అవుట్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లేఅవుట్ల అనుమతుల జారీ విషయంలో అధికారులు అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనుమతుల కోసం కమిటీ కి వచ్చిన జిల్లా కేంద్రానికి సంబంధించి నాలుగు లేఅవుట్ల దరఖాస్తుల పై అన్ని శాఖల అధికారుల క్లియరెన్స్ ను కలెక్టర్ అడిగారు. అయితే లే అవుట్ కమిటీ కి వచ్చిన నాలుగు లే అవుట్ లలో రెండు లే అవుట్ లకు కలెక్టర్ అధ్యక్షతన కమిటీ అనుమతులు జారీ చేసింది. మిగతా రెండు లే అవుట్ల అనుమతులను కమిటీ నిరాకరించింది.

# ప్రమాదం జరిగిన మొదటి గంట కీలకం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రమాదం జరిగిన తరువాత మొదటి గంట (గోల్డెన్ అవర్) అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. ఈ గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేర్చిన వారికి కేంద్ర ప్రభుత్వ పథకమైన "రాహ్–వీర్" ద్వారా ప్రోత్సాహకాలు అందజేయబడతాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్–అలైవ్" అవగాహన కార్యక్రమాల సందర్భంగా అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో సిపిఆర్, గోల్డెన్ అవర్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీసీలో 30 ఏళ్లుగా ఎలాంటి ప్రమాదం చేయకుండా సేవలందిస్తున్న డ్రైవర్ సురేందర్ రెడ్డిని సత్కరించారు. అదనపు ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాధితుని ఎడమచేతి నాడి పరిశీలించి, పల్స్ లేకపోతే వెంటనే సీపీఆర్ చేయాలని సూచించారు. 18 సెకండ్లలో సుమారు 30 సార్లు ఛాతిపై ఒత్తిడి ఇవ్వడం, అవసరమైతే నోటి ద్వారా శ్వాస అందించడం వంటి ప్రాథమిక చికిత్సా విధానాలను వివరించారు. అనంతరం తక్షణ వైద్య సహాయం అందించేలా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అలాగే వేసవి కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, వడదెబ్బ నుంచి రక్షణ కోసం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, ఆర్టీసీ డిఎం, ఆర్టీవో, నాగర్ కర్నూల్ సబ్‌డివిజన్ డిఎస్పీ శ్రీనివాస్, సీఐలు ఉపేందర్, అశోక్ రెడ్డి, ఆర్‌ఐ జగన్, ఎస్సైలు గోవర్ధన్, ప్రశాంత్, శివాజీ, కళ్యాణ్, ఆర్టీసీ డ్రైవర్లు, డ్రైవింగ్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



## ఒక్క ప్రాణం పోకూడదు




**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** గద్వాలలోని వజ్రా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన "అరైవ్ అలైవ్" కార్యక్రమం ఎస్పీ టి. శ్రీనివాసరావు తన గ్రామంలో యాక్సిడెంట్ వల్ల ఒక్క ప్రాణం కూడా పోకూడదు అని ప్రతి సర్పంచ్ తీర్మానం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో హెల్మెట్ వినియోగాన్ని కచ్చితంగా అమలు చేయాలని, చిన్న వయస్సులో ట్రాక్టర్లు నడపడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద విషాదానికి కారణమవుతుంది అని హెచ్చరించారు. "గోల్డెన్ అవర్" ప్రాముఖ్యతను వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "క్యాష్‌లెస్ ట్రీట్మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ స్కీమ్" గురించి వివరిస్తూ ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి చేర్చిన వారికి రూ.25 వేల ప్రోత్సాహకం, బాధితుడి చికిత్సకు రూ.1.5 లక్షల వరకు ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఎస్పీ స్వయంగా వేదికపై సీపీఆర్ ప్రదర్శించారు. వైద్య నిపుణులు రాజు, షఫీ, అభినేష్ ల బృందం ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన అత్యవసర చర్యలను ప్రాక్టికల్‌గా వివరించారు. డీఎస్పీ మొగులయ్య, సీఐ టంగుటూరు శ్రీను, ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మహిళలను వేధించే వారిని వదిలేది లేదు

**ఉమెన్ సేఫ్టీ డీసీపీ ఉషారాణి**

**ముద్ర, మల్కాజిగిరి:** మహిళలు, బాలికలను వేధించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టరని మల్కాజిగిరి కమిషనరేట్ ఉమెన్ సేఫ్టీ డీసీపీ టి. ఉషారాణి స్పష్టం చేశారు. వేధింపులకు గురయ్యే మహిళలు భయం వీడి ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు. మహిళలను వేధిస్తున్న వారికి డీసీపీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, పాఠశాలలు, కళాశాలలు మార్కెట్లు వంటి బహిరంగ ప్రదేశాలలో షీ టీమ్స్ మఫ్టీలో నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. మహిళలను వేధిస్తున్న 88 మందిని (73 మంది మేజర్లు, 15 మంది మైనర్లు) షీ టీమ్స్ పట్టుకున్నాయి. మొత్తం 106 ఫిర్యాదులు అందగా, వీటిలో ప్రత్యక్ష వేధింపులు (53), ఫోన్ కాల్స్ ద్వారా వేధింపులు (28), సోషల్ మీడియా ద్వారా వేధింపులు (25) ఉన్నాయి. 9 క్రిమినల్ కేసులు, 20 పెట్టీ కేసులు నమోదు చేయగా, 66 మందికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

## కళ్యాణం.. కమనీయం



**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** కేటిదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలోనిపాగుంటా శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామివారి అమావాస్య సందర్భంగా శుక్రవారం స్వామివారి కళ్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, దీక్షా హోమం, శాంతిహోమం, పూర్ణాహుతి, చక్రస్నానం నిర్వహించారు. అనంతరం అలివేల మంగ సమేత లక్ష్మివేంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం మహామంగళ హారతి, మంత్రపుష్పం సహితంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. భక్తులు అఖండ భజనలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి




**ముద్ర, నారాయణపేట:** పీఆర్సీ నివేదిక తక్షణమే అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని టీజీఈజేఏసీ చైర్మన్ ఎం. నర్సింహరెడ్డి అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తెలంగాణ రెండవ పిఆర్సీ కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం పిఆర్సీ గడువును పొడిగించకుండా నివేదిక తెప్పించుకొని సంఘాలతో చర్చించి 51% ఫిట్మెంట్తో అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు ఒకేసారి చెల్లించాలన్నారు. 2024 మార్చి నుండి రిటైర్ అయిన 12000 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఏక మొత్తంగా రూ. 10 వేల కోట్లు కేటాయించి పెండింగ్ బిల్లులు అన్ని క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కు అందించారు. టీజీవో జిల్లా అధ్యక్షులు మొగులప్ప, పిఆర్ టి యు జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి, శివరాములు, రెడ్డప్ప, సంతోష్ కుమార్, నర్సింహా రెడ్డి, రామ్ రెడ్డి, రామకృష్ణ, తిరుమలేష్, భీమయ్య, బాలరాజు, సూర్య చంద్ర, రషీద్, అలివేలమ్మ, అమరేందర్ కృష్ణ, రాణి , సురేందర్, దామోదర్, వెంకటరెడ్డి, వెంకటస్వామి, దేవేంద్రప్ప, రఘువీర్, బాలాజీ, బసప్ప, శ్రీనివాస్, ఉదయ భాను, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

**నాగర్ కర్నూల్ లో..**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నాన్–గెజిటెడ్ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. వేతన సవరణ పెండింగ్ బిల్లుల చెల్లింపు, కాష్‌లెస్ హెల్త్ కార్డుల అమలు, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు వంటి ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ సిబ్బందితో పాటు ప్రశాంత ఉద్యోగుల సంఘ నాయకులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, పోల శ్రీనివాసులు, నరసయ్య, బాలస్వామి, లక్ష్మీకాంతరావు, శ్రీనివాసులు, పాండురంగయ్య పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లు పక్కాగా చేయాలి

**కలెక్టర్ బాదావత్ సంతోష్**




**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** రబీ సీజన్‌కు ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని, నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ బాదావత్ సంతోష్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ భవనంలో అదనపు కలెక్టర్ అమరేందర్ తో పాటు సన్నాహక సమావేశం, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో రబీ సీజన్‌లో సుమారు 1,87,418 ఎకరాల్లో సాగు జరిగి, దాదాపు 1.20 లక్షల మంది రైతుల నుంచి 4,44,033 మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం సాధారణ రకం ధాన్యం రూ.2,369, ఏ–గ్రేడ్ రూ.2,389 చెల్లించాలని, అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సెక్టార్‌కు కనీసం 25 లారీలను ఏర్పాటు చేయాలని, నిల్వ ఉన్న ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. వాహనాల కొరత కారణంగా ఆలస్యం జరిగితే సంబంధిత కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే బ్లాక్‌లిస్ట్‌లో చేర్చుతామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, నమోదు ప్రక్రియ వేగవంతంగా జరగేలా చూడాలని, రైతులు వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేపట్టాలని సూచించారు. రైతులకు త్రాగునీరు, నీడ, కూర్చునే సౌకర్యాలు, ఫ్యాన్లు, తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. తార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని, గన్నీ బ్యాగులు తగిన మోతాదులో నిల్వ ఉంచాలన్నారు. నిర్లక్ష్యం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి**

నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో కలెక్టర్ బాదావత్ సంతోష్ పర్యటించి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల్లో ఆలస్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే పూర్తి చేసిన ఇళ్లు, నిర్మాణంలో ఉన్నవి, ఇంకా ప్రారంభం కాని ఇళ్ల వివరాలను సమీక్షించి, పనులు నెమ్మదిగా ఉన్న చోట వేగం పెంచాలని చెప్పారు. నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, లబ్ధిదారులతో నిరంతరం సంప్రదింపులు జరిపి పనులను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. అలాగే, పనుల పురోగతిపై మున్సిపల్ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ వ్యవస్థ ఉండాలని, ప్రతి దశలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు కొనసాగించాలని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, హౌసింగ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాప్రా చెరువు సుందరీకరణకు రూ.35 కోట్లు



**ముద్ర, కాప్రా:** కాప్రా చెరువులో రూ.35 కోట్లతో సుందరీకరణ పనులను చేపట్టనున్నట్లుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాప్రా చెరువును పరమేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్ నల్ల చెరువు రూ.20 కోట్లతో చేపట్టిన పనులు తుది దశలో ఉన్నాయన్నారు. ఇదే కాకుండా నాచారం హెచ్ఎంటీ నగర్ చెరువు రూ.30 కోట్లు, రామంతాపూర్ పెద్ద చెరువు రూ.17 కోట్లతో అభివృద్ధి, సుందరీకరణ పనులను చేపట్టనున్నట్లుగా చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, స్వర్ణరాజ్ శివమణి, సింగిరెడ్డి ధన్పల్ రెడ్డి, కాప్రా డివిజన్ అధ్యక్షుడు కొబ్బరినూరి నాగ శేషు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

## అర్హులందరికీ సదరం సర్టిఫికెట్లు ఇవ్వాలి



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** సదరం సర్టిఫికెట్ కు అర్హులైన వారందరికీ మంజూరు అయ్యేవిధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో సదరం క్యాంపుల నిర్వహణ, యుడిఐడి పోర్ట్ లో అప్లోడ్ పై డిపిఎం, ఏపీఎంలతో జిల్లా అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ కొరకు చేసుకున్న దరఖాస్తులన్నీ యూడిఐడి పోర్టులో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. సదరం క్యాంపుకు ఎక్కువ మొత్తంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ తక్కువ మంది క్యాంపులకు హాజరవుతున్నారనే విషయాన్ని అదనపు కలెక్టర్ గుర్తించారు. ఆధార్ సర్టిఫికెట్ కొరకు స్లాట్ బుక్ చేసిన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా సమాచారాన్ని ఇచ్చి క్యాంపులకు హాజరు అయ్యేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆయన సూచించారు. డిఆర్డిఏ ద్వారా చేపట్టే వివిధ కార్యక్రమాల గురించి ఆయన ఆరా తీశారు. సమీక్ష సమావేశంలో డిఆర్డిఏ శ్రీనివాస్, డిప్యూటీ డిఆర్డిఏ నర్సింలు, డిపిఎం మహేష్, ఏపిఎంలు పాల్గొన్నారు.

## ఎంపీ తేజస్వి సూర్యాను సస్పెండ్ చేయాలి

**ముద్ర, తాండూర్:** తెలంగాణ అస్తిత్వాన్ని తెలంగాణ పోరాటాన్ని అవమానించిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యా ను సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్వీ యువ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటును భారతదేశం,పాకిస్తాన్ విభజనతో పోల్చడాన్ని తెలంగాణ ప్రజలను అవమానించడమేనన్నారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఏం చేస్తున్నరని వారు మండిపడ్డారు. పార్లమెంటులో బీఆర్ఎస్ ఎంపీలు ఉంటే ఈరోజు పార్లమెంట్ ను స్తంభింప చేసేవారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ ఎస్ వి యువ నాయకులు షేక్ ఇబ్రహీం, వినోద్ కుమార్, షోహెబ్ అద్దు, రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో రోగి సహాయకులకు పూజారి బూరుల నరసింహారావు అన్నదానం చేశారు. హౌసింగ్ బోర్డ్‌కు చెందిన ఆయన 2014 సంవత్సరం నుంచి ప్రతి నెలలో ఒక రోజు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

## పోలీస్ ఉద్యోగాలకు ఉచిత కోచింగ్

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** తలకొండపల్లి మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు ఉచితంగా శిక్షణ రెడ్డి మేన్ కాంప్లెక్స్‌లో కోచింగ్ సెంటర్ నిర్వహించనున్నట్లు యువ నాయకుడు పెరుమండ్ల సురేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సీఓటీ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, శ్రీ విశ్వ అకాడమీ సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ కోచింగ్ తరగతులు ఏప్రిల్ 19 నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి



**ముద్ర, మల్కాజిగిరి:** రాష్ట్రంలో అమలవుతున్న 15 శాతం ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణ ప్రకారం మాదిగల జనాభా ప్రాతిపదికన కనీసం 11 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసింది. మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ మాదిగ అధ్యక్షతన నేరేడ్మెట్ అంబేద్కర్ భవన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా ఇంచార్జ్ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు కేశపాగ రాంచందర్ మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ గతం నుంచే మాదిగల జనాభా 10–11 శాతం మధ్యలో ఉంటుందన్నారు. ప్రస్తుతం కేటాయించిన 9 శాతం రిజర్వేషన్లను కొంతమంది మేధావులు స్వాగతించడం దురదృష్టకరం, వారి స్వార్థం కోసం చేసిందిగా, ఇది మాదిగ జాతి హక్కులను దెబ్బతీసే చర్యగా అభిప్రాయపడింది. జాతి ప్రయోజనాలను పక్కనబెట్టి పాలకుల మెప్పు కోసం పనిచేసిన వారిని మాదిగ సమాజం ఎప్పటికీ అంగీకరించదని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్‌లో చేరిన ఉపసర్పంచ్

**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:** చెన్నారం గ్రామ ఉప సర్పంచ్ గుద్దేటి నర్సింహ టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో చేరారు. అలాగే క్రికెట్ టోర్నమెంట్‌తో పాటు సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలని వెలిజాల గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు, ఎల్‌ఓసీ పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

### పెళ్లికి స్వతంత్ర నిర్ణయం

పెళ్లి ఒత్తిడితో కాకుండా, స్వయంగా తీసుకున్న నిర్ణయం కావాలి. మీకు మీరు స్పష్టంగా ఉండాలి.



# అంగన్ వాడీల హామీలు నెరవేర్చుతాం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల సమయంలో అంగన్ వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లాలోని అంగన్ వాడీ టీచర్లకు సెల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ సత్య ప్రసాద్ కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కింద న్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ముందుకు సాగుతున్నరని మంత్రి తెలిపారు. అంగన్ వాడీ టీచర్లు తల్లి బిడ్డల క్షేమం కోసం పనిచేయాలని మంత్రి కోరారు. ప్రస్తుతం అంగన్వాడీ సేవలను ఆన్లైన్ ద్వారా అందించడానికి ప్రభుత్వం అంగన్ వాడీ టీచర్లను సెల్ ఫోన్లు అందిస్తుందని మంత్రి వివరించారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత అంగన్ వాడీలు తీసుకోవాలని కోరారు. జగిత్యాల జిల్లాలోని అంగన్ వాడి టీచర్లకు త్వరలో కంటి పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు.

#### విద్యకు ప్రథమ ప్రాధాన్యం..

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని. రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందించడానికి ముందుకు సాగుతున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.జగిత్యాల మండలం లక్ష్మీపూర్ ప్రభుత్వ పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని, బక్సెట్ బాల్ కోర్టును మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో అసమానతలు తొలగిపోతాయని భావించిన ముఖ్యమంత్రి విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గ్రామానికి చెందిన తిరుపతి రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందుకు మంత్రి అభినందించారు.అడిషనల్ జిల్లా కలెక్టర్ రాజ గౌడ్ , మునిసి పల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి, మార్కెట్ యార్డ్ కమిటి చైర్మన్ నారాయణ రెడ్డి , కౌన్సి లర్ ప్రశాంత్ , జిల్లా సంక్షేమ అధికారి రాజ్ కుమార్, సీడీపీవోలు, సూపర్ వైజర్లు , అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

#### సీడ్ ప్లాంట్ కు సహకరించండి..

లక్ష్మపూర్ లో ఏర్పాటు చేయవలసిన సీడ్ ప్లాంట్ నిర్మాణం పూర్తి అవ్వడానికి సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కోరారు. స్థానిక సర్పంచ్ కవితతో పాటు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆలయ ఉత్సవాలకు రండి..

**- మంత్రి కి ఆహ్వాన పత్రికలు అందజేసిన ఆలయ కమిటీ సభ్యులు**

**ముద్ర, ధర్మపురి:** నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో నిర్వహించే వేడుకలకు హాజరు కావాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ఆలయాల ధర్మకర్తల మండలి తరపున శుక్రవారం ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రికలను అందజేశారు. ధర్మపురి లోని శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి నిర్వహించే నరసింహ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆలయ ఈవో శ్రీనివాస ఆధ్వర్యంలో పూజారులు మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. వెల్గటూర్ మండలం కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. ధర్మారం మండలం ఖిలా వనపర్తి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను కమిటీ సభ్యులు అందజేశారు.

## అల్ఫోర్స్ లో సర్వేపల్లి రాధాకృష్ణన్ కు ఘన నివాళి




**ముద్ర, కరీంనగర్:** నగరంలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ లో శుక్రవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ రాష్ట్రపతిగా అనేక సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయండి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద రైతులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుత ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని కేంద్రాల వద్ద టెంట్లు, తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. తగినన్ని గన్నీ సంచులు, తూకపు యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్డీఓ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, మార్క్ ఫెడ్ ప్రతినిధులు మహేష్, మిలర్స్ అసోసియేషన్ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానంతో ఎంతో పుణ్యం



**కోరుట్ల, ముద్ర:** అమావాస్య రోజున అన్నదానం చేస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని బ్రహ్మశ్రీ డాక్టర్ చంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి సూచించారు. పట్టణంలో శుక్రవారం సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్నపూర్ణ అమావాస్య అన్నప్రసాద వితరణ సేవ నిర్వహించారు. సుమారు 1200 మందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు. ముందుగా అర్చకులు పాలెపు కార్తీక్ భరద్వాజ్ శర్మ ఆధ్వర్యంలో గోపూజ, అన్నపూర్ణ మాత పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రహ్మశ్రీ డా. బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి మాట్లాడుతూ అన్నదానం అన్నింటిలో కెల్లా శ్రేష్టమైన దానమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ ప్రచార సమితి అధ్యక్షుడు మంచాల జగన్, బట్టు హరికృష్ణ, రేగుంట రాజారాం, అన్నపూర్ణ అమావాస్య అన్నప్రసాద సేవ కమిటీ చైర్మన్ వనపర్తి చంద్రమోహన్, గంప శివ కుమార్, మంచాల రమేష్, కమిటీ సభ్యులు శ్రీపతి రమేష్, మహాదేవ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నవేని రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని టీజీఈజేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం ఆదేశం మేరకు శుక్రవారం టీజీఈజేఏసీ జిల్లా చైర్మన్ మిర్యాల నాగేందర్ రెడ్డి, జిల్లా కన్వీనర్ కందుకూరి రవిబాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, నాలుగో తరగతి, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అదనపు కలెక్టర్ బీఎస్.లతకు టీజీఈజేఏసీ జగిత్యాల పక్షాన వినతిపత్రం అందజేశారు.

#### భూపాలపల్లిలో..

**మహాదేవపూర్, ముద్ర:** ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. జేఏసీ చైర్మన్ బూరుగు రవికుమార్ , జేఏసీ కన్వీనర్ విజయలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శుభాకర్ రెడ్డి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఎస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దిల్షాద్, జిల్లా రెవిన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్, పెన్షనర్ల సంఘ నాయకులు ఐలయ్య, మధుసూదన్, శ్రీనివాస్, టీఎంగోస్ జిల్లా కార్యదర్శి దశరథరామరావు, టీజీఓ కార్యదర్శి సునీల్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నక్క తిరుపతి, ఆయా జేఏసీ నాయకులు కిరణ్కుమార్, శ్రీనివాస్, భార్గవ్, శ్రీనివాస్, అహ్మద్, మధుసూదన్, శ్రీనివాసరావు, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, శంకర్, విజయ్, శ్రీదేవిపాల్గొన్నారు.

#### నిర్మల్ లో..


**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల సాధనకు టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేసిన ధర్నాలో నిరసనలు హోరెత్తాయి. మధ్యాహ్న భోజన విరామ సమయంలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయ, పెన్షనర్లు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, మాట్లాడారు. టీజీఈజేఏసీ జిల్లా సెక్రటరీ జనరల్ పీజీ రెడ్డి, అడిషనల్ సెక్రెటరీ జనరల్ నరేంద్ర బాబు, కో చైర్మన్ జె. లక్ష్మణ్, నాయకులు డి.రమేష్, కుడాల రవికుమార్, రవికాంత్, శంకర్, విజయ్ కుమార్, దేవేందర్, కృష్ణారావు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి



**బోథ్, ముద్ర:** బోథ్ నియోజకవర్గంలో జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయా లని స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ తో కలిసి హైదరాబాద్ లో మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.శ్రీనివాస్ రెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రంతో పాటు ధన్నూర్, నేరడిగొండ, ఇచ్చొడ, తాంసి, భీంపూర్, బజార్ హత్నూర్ లలో వెంటనే జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కాగా తమ వినతికి మేనేజింగ్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ నెల 20 నుంచే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు.

## ఎవరికైనా కర్మఫలం తప్పదు




**కోరుట్ల, ముద్ర:** సకల జీవులకు వారు చేసుకున్న కర్మఫలం అనుభవించక తప్పదని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ పేర్కొన్నారు. సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా కోరుట్ల వాసవి కళ్యాణ భవనంలో శుక్రవారం 'శ్రీ వరాహ మహాపురాణ సప్తాహం' ఐదవ రోజు ప్రవచనం వైభవంగా జరిగింది. సమితి ప్రచార కార్యదర్శి చలిగంటి వినోద్ పావని దంపతులు, మాడిశెట్టి రవీందర్ సమితి అధ్యక్షులు మంచాల జగన్, ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారాం, పురాణ కమిటీ చైర్మన్ పడిగెల శ్రీనివాస్ తదితరులు ల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, ధర్మపురి:** రాష్ట్రంలోని ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహ సదన్ ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రూ. 5 కోట్ల అంచనాలతో ప్రారంభించిన శ్రీ లక్ష్మీనరసింహ సదన్ నిర్మాణానికి గత ప్రభుత్వం కేవలం కోటి రూపాయలు మాత్రమే నిధులు విడుదల చేసిందని తెలిపారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కాగితాలకు పరిమితమైందన్నారు. శ్రీ లక్ష్మి నరసింహ సదన్ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ. కోటి విడుదల చేసే తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే శ్రీ లక్ష్మీనరసింహ సదన్ ను అందుబాటులోకి తీసుకురావడానికి రూ. 2.24కోట్లు విడుదల చేయించినట్లు మంత్రి తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వేముల రాజేష్ తో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# సీఎం సభకు రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలి

**- మంత్రి శ్రీధర్ బాబు**



**మహాదేవపూర్, ముద్ర:** జయశంకర్ భూపాలపల్లి కాటారం మండలంలోని నస్తూరుపల్లిలో ఈ నెల 20న నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు పెద్ద ఎత్తున రైతులు, మహిళలు హాజరు కావాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. శుక్రవారం కలెక్టరేట్ లో ముఖ్యమంత్రి బహిరంగ సభ గురించి కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిసెట్టి సంకీర్త్, భూపాలపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ జిల్లా అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సాయంత్రం 4 గంటలకు మేడిగడ్డ, కాళేశ్వరం సందర్శించనున్నట్లు చెప్పారు. అనంతరం కాటారం మండలం నస్తూరిపల్లిలో రైతు భరోసా రెండో విడత నిధులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో కలిసి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఏఎస్పీ నరేష్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

#### అసౌకర్యాలకు తావుండకూడదు ..

ముఖ్యమంత్రి కార్యక్రమాల్లో అసౌకర్యాలకు తావుండవద్యని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. అధికారులు సమ న్వయంతో పనిచేయాలని సూచించారు.

# అమృత్ పథకం పేరుతో దోపిడీ

**- మాజీ మేయర్ రవీందర్ సింగ్**



**ముద్ర, కరీంనగర్:** నగరంలో అమృత్ పథకం పేరుతో కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నారని కరీంనగర్ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ ఆరోపించారు. నగరంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చుతోందన్నారు. పాత డివిజన్లతో పాటు ఇటీవల విలీనమైన డివిజన్లలో పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం తాను మేయర్ గా ఉన్న సమయంలోనే ఒకే రోజు 10 వేలకుపైగా నల్ల కనెక్షన్లు ఇచ్చి నగర చరిత్రలో కొత్త అధ్యాయం సృష్టించామని తెలిపారు. తీగలగుట్టపల్లి, ఆరేపల్లి, రేకుర్తి, పద్మానగర్, వల్లంపహాడ్, సీతారాంపూర్, బొమ్మకల్, గోపాలపూర్, దుర్శేడ్, చింతకుంట, మల్కాపూర్ వంటి విలీన డివిజన్లలో ఇప్పటికే పైప్‌లైన్లు, ఓహెచ్ఎస్ఆర్‌లు నిర్మించిన విషయాన్ని స్పష్టం చేశారు.అమృత్ పథకంలో భాగంగా పైపులు వేసేందుకు తవ్వుతూ డబ్బులు కాజేస్తున్నారని ఆరోపించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
18.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



పెళ్లికి..
పెళ్లికి శారీరక ఆరోగ్యం ఆరోగ్య పరిస్థితులు, భవిష్యత్ కుటుంబ ప్రణాళిక దృష్టిలో పెట్టుకోవాలి.



# అజాగ్రత్తతోనే ప్రమాదం

- రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి
- జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా




**ముద్ర, సూర్యాపేట:**
రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ – అలైవ్ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుగా స్థానిక కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా నుండి రోడ్డు భద్రత పై నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పిల్లల మర్రి వద్ద బ్లాక్ స్పాట్స్ లను పరిశీలించారు. రుద్రంగి కన్వెన్షన్ హాల్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాలతో ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని, ఈ నేపధ్యంలో రోడ్డు భద్రత ను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. అజాగ్రత్తగా వాహనాలు నడిపితే ప్రమాదం పొంచి ఉందని అన్నారు. ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సిట్ బెల్ట్ లేకుండా వాహనాలను నడపడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని సూచించారు.

**భద్రంగా గమ్య స్థానాలకు చేరాలి..**
జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రయాణ సమయంలో భద్రంగా గమ్య స్థానాలకు చేరుకోవడమే అరైవ్ – అలైవ్ లక్ష్యమని తెలిపారు. జిల్లాలో దాదాపు 200కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు, 3600కిలో మీటర్ల మేరకు గ్రామీణ రోడ్లు విస్తరించి ఉన్నాయని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకునేలా సూర్యాపేట జిల్లాలో రోడ్డు భద్రతపై వివిధ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా సూచనలను పాటించాలని కోరారు.

**అవగాహన అవసరం..**
ప్రజలకు రోడ్డు భద్రత నియమాల పట్ల విస్తృత అవగాహన కల్పిస్తున్నామని జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఇతర శాఖలతో సమన్వయంగా పనిచేస్తూ ముందుకు పోతున్నామన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం నాలుగు లక్షల పైగా రోడ్డు ప్రమాదాల సంభవిస్తున్నాయని, సూర్యాపేట జిల్లాలో గత సంవత్సరం 600 పైగా రోడ్డు ప్రమాదాలు సంభవించగా 230 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. చివ్వెంల మండల పరిధి జాతీయ రహదారి 65 ఏచర్ల ముత్యాలమ్మ గుడి వద్ద ఏసీ డీసీఎం, టాటా ఏసీ రోడ్డు ప్రమాదం సంభవించగా సంఘటనలు క్షతగాత్రులకు సహాయ సహకారాలు అందించి 108 కి, పోలీసు వారికి వేగంగా సమాచారం అందించిన వాళ్లభాపురం గ్రామానికి చెందిన రవీందర్ అనే వ్యక్తిని ఈ సందర్భంగా అధికారులు సన్మానించారు.

**ఆకట్టుకున్న కళా ప్రదర్శన:**
పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన భూలోకం, యమలోకం అనే నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఈ నాటక ప్రదర్శన నందు వివరించారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ డిఐజి శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, ఆర్టీసీ డిఎం సునీత, ఆర్టీవో జయప్రకాశ్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్, సూర్యాపేట కోదాడ తిరుమలగిరి నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు మున్సిపల్ కమిషనర్లు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదాలు చూస్తే ఆవేదన కలుగుతుంది..

జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాద గణాంకాలు పరిశీలిస్తే ఆవేదన కలుగుతుందని, అరైవ్ అలైవ్ అనే రోడ్డు భద్రత కార్యక్రమం అద్భుతమైనదని దీని ద్వారా ప్రజలు మరింత చైతన్యమంత అవుతున్నారని కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి అన్నారు. ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర పోలీస్ శాఖ కు అభినందనలు తెలియజేస్తున్నారని తెలిపారు. అరైవ్ అలైవ్ అనేది ఒక పదం కాదు ఇది ఒక మహా ఉద్యమం అన్నారు. వాహనదారులు ప్రజలు యువత ప్రతి ఒక్కరూ ప్రయాణ సమయంలో రహదారి నియమాలు పాటించాలని పోలీసు వారి సూచనలు పాటించాలని ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని కోరారు.



## ఆండాళ్ అమ్మ వారికి ఊంజలి సేవ

**ముద్ర, యాదగిరిగుట్ట :**
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మ వారికి ఊంజలి సేవోత్సవం పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ అర్చకులు నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. అమ్మవారికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అమ్మవారిని ప్రధాన ఆలయం నందు అద్దాల మండపంలో అధిష్టింపజేసి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు.



## ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ డివిజన్ కమిటీ ఎన్నిక

**ముద్ర, సూర్యాపేట:**
సూర్యాపేట జిల్లాలో నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం డివిజన్ కమిటీ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు, కార్యదర్శుల సమక్షంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షురాలుగా ఎస్. మల్లేశ్వరి, ఉపాధ్యక్షులుగా ఎస్కే జహీరం ఎన్నికయ్యారు.ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, సహాయ కార్యదర్శిగా విను, సంయుక్త కార్యదర్శిగా ఎస్ కె మీరా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతరం మర్యాద పూర్వకంగా సూర్యాపేట ఆర్డిఓ వేణుమాధవ్ ను కలిశారు. వెంట జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పుల్లయ్య తదితరులు ఉన్నారు.



## 200 రోజులు ఉపాధి కల్పించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ శ్రీనివాస్

**ముద్ర, బీబీనగర్:**
ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు 200 రోజుల పని దినాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీబీనగర్ మండల కన్వీనర్ గాడి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బీబీనగర్ మండల పరిధిలో గొల్లగూడెంలో ఉపాధి కూలీల పని ప్రదేశంలో సందర్శించి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులను గ్రామీణ పేదలకు రెండు పూటల బువ్వ పెడుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించి విబి – జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని అన్నారు. ఎర్రటి ఎండలో పని చేస్తున్న ఉపాధి కూలీలకు కనీసం రోజు కూలి 200 నుండి 250 రూపాయలు రావడం లేదని అన్నారు. గతంలో తాగడానికి నీళ్లు మెడికల్ కిట్టు, నీడ కోసం టెంట్ ఉండేదని కానీ బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూలీలకు అందిస్తున్న మౌలిక వసతులు అన్నింటిని ఎత్తివేసారని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బండారి శ్రీరాములు, ఉపాధి కూలీలు మొగిలి లక్ష్మమ్మ, గుండెబోయిన భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జనాభా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలి




**ముద్ర, సూర్యాపేట:**
తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా ప్రకారం 11 శాతం ఎస్సీ రిజర్వేషన్ల వాటా అమలు చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు యాతాకులరాజన్న మాదిగ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్ జమ్మిగడ్డలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశం రాజన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా కన్వీనర్ ఏపూరి రాజు మాదిగ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర తెలంగాణ రాష్ట్రంలో జనాభా కుల గణన లో మాదిగలు 10.3 శాతం ఉన్నారని లెక్కలు తేల్చిందని, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేసే ప్రక్రియలో మాదిగల జనాభా ప్రాతిపదికన మాదిగల వాటా 11% రావాలని ఆ నాడే పద్మశ్రీ మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారని అన్నారు. మా వాటా 11 శాతాన్ని వెంటనే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి బొజ్జ సైదులు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణగిరిలో శ్రీ సుదర్శన నారసింహ హవనం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
సకల దోష నివారణార్థం అమావాస్యని పురస్కరించుకొని స్వర్ణగిరి క్షేత్రంలో శుక్రవారం శ్రీ సుదర్శన నారసింహ హవనం నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవతో మొదలుకొని నిత్య కైంకర్యాలు జరిగాయి. వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవ, నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేద మంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, శ్రీ పద్మావతి అమ్మవారి కి సహస్ర కుంకుమార్చన సేవ అర్చక స్వాములు చేశారు.

శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవ






## నల్ల బ్యాడ్జీలతో ధర్నా

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక, పెంక్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (టీజీజాక్ ) రాష్ట్రకార్యవర్గం పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సహ అధ్యక్షులు, యాదాద్రి భువనగిరి జిల్లా జె.ఏ.సి. చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు 2023 నుండి రావలసిన రెండవ పి.ఆర్.సి.ని వెంటనే అమలు చేయాలని, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావలసిన పెన్షన్ బెనిఫిట్స్ మొత్తమును ఏకకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెన్షన్ బెనిఫిట్స్ అందక "80" మంది రిటైర్డ్ ఉద్యోగులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మానిఫెస్టోలో తెలిపిన విధంగా ఉద్యోగులకు ఇచ్చిన అన్ని రకాల డిమాండ్స్ ను అమలు పరిచి ఉద్యోగుల సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జె.ఏ.సి. సెక్రటరీ జనరల్ యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షులు భగత్, జె.ఏ.సి. డిప్యూటీ సెక్రటరీ జనరల్ అమరెందర్ రెడ్డి, కోచైర్మన్ యాదయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్యక్షులు, జె.ఏ.సి. కో చైర్మన్ జగన్మోహన్ ప్రసాద్ , కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రైతు సంఘం సభల పోస్టర్ ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**
తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 23, 24,25 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో జరిగే 3వరాష్ట్ర మహాసభ ల పోస్టర్ ను రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశం – అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు, బహుళజాతి కంపెనీల విత్తనాలను దిగుమతి చేసుకొని విత్తన సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతాంగంపై పెను భారాలు మోపే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై




ఈ రాష్ట్ర 3వ మహాసభలలో సమగ్రంగా చర్చించి దిశా నిర్దేశం చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు జిట్టఅంజిరెడ్డి, మాజీ పాలఉత్పత్తి దారుల సహకార సంఘం చైర్మన్ జిట్ట సత్తి రెడ్డి, జిట్టా ఎట్టా రెడ్డి, జిట్ట రవీందర్ రెడ్డి, నారాయణ రెడ్డి, రమేష్ రెడ్డి, సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

# 'నారీ శక్తి వందన్' మద్దతుకు సంతకాల సేకరణ




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :**
కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'నారీ శక్తి వందన్ అధినియం' చట్టంపై అవగాహన కల్పిస్తూ భారతీయ జనతా యువమోర్చా భువనగిరి పట్టణ శాఖ అధ్యక్షులు కానుకుంట్ల రమేష్ ఆధ్వర్యంలో భువనగిరి వివిధ కళాశాలలో సంతకాల సేకరణ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు, నారీ శక్తి వందన్ అధినియం భువనగిరి పార్లమెంట్ కో కన్వీనర్ పట్నం కపిల్ మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం చారిత్రాత్మకమని, ఇది రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచుతుందని పేర్కొన్నారు. మహిళలు నిర్ణయాధికారంలోకి వచ్చినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.మహిళలకు పార్లమెంట్, విధాన సభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని బలపరుద్దామని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ప్రవేశపెట్టడం భారత ప్రజాస్వామ్యంలో చారిత్రక ఘట్టమని ఆయన అభిప్రాయపడ్డారు. 'నారీ శక్తి వందన్ అధినియం' మహిళా సాధికారతతో పాటు దేశ ఉన్నతికి దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వంలో, పరిపాలనలో, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుందని నమ్ముతున్నట్లు వ్యాఖ్యానించారు. భరతమాతను పూజించే దేశంగా నారీ శక్తి కి వందనం పలుకుదామని ప్రతి ఒక్కరూ ఈ చట్టానికి మద్దతు తెలిపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లు వంగేటి సుచరిత, బండారు స్వర్ణలత, బిజెపి పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, బిజెపి నాయకురాలు ఇండ్ల సత్యవతి, ఎంజాల మల్లిక, లక్ష్మి , పావని, లత, కట్కామోజు ఉషాకిరణ్, జెరిపోతుల భరత్, తెల్దురి శివలింగం, ప్రసన్న, నిర్మల పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
18.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews

8 పశ్చిమ తెలంగాణ
మెదక్, నిజామాబాద్
Medak, Nizamabad

పెళ్లికి సరైన భాగస్వామి
విలువలు, ఆలోచనలు, జీవనశైలి కలిసొచ్చే వ్యక్తి కావాలి. కేవలం వయసు చూసి నిర్ణయం తీసుకోకూడదు.




## మాదిగలకు 11శాతం రిజర్వేషన్ల డిమాండ్

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్

**ముద్ర ప్రతినిధి, సిద్ధిపేట:**

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిద్ధిపేటలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు లింగంపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ముక్కపల్లి రాజు మాట్లాడుతూ మాదిగల జనాభా శాతానికి అనుగుణంగా 10 నుంచి 11 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కుల గణన నివేదికలో మాదిగల జనాభా సుమారు 10.3 శాతంగా తేలిందని, అందువల్ల ఎస్సీ వర్గీకరణలో అదే మేరకు వాటా ఇవ్వాలని పేర్కొన్నారు. గతంలో తక్కువ శాతం రిజర్వేషన్లను అంగీకరించడం వల్ల మాదిగలకు అన్యాయం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం వెలువడిన కుల గణన నివేదికతో తమ వాదన నిజమైందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అంశంపై పునరాలోచించి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రంలో మాదిగలు జనాభాలోనే కాకుండా దినసరి కూలీలు, భూమిలేని నిరుపేదలలో కూడా అధికంగా ఉన్నారని, ఇది వారి సామాజిక వెనుకబాటుతనాన్ని సూచిస్తుందని తెలిపారు. వారి అభివృద్ధికి ప్రత్యేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని ప్రభుత్వ నియామకాల్లో మాదిగలకు 11 శాతం వాటా ఇవ్వాలని కోరారు. శాసన మండలి, లోక్‌సభ, రాజ్యసభ వంటి స్థానాల్లో మాదిగలకు తగిన ప్రాతినిధ్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగలు ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణ మాదిగ చేసిన పోరాటం వల్లే ఈ అంశం ముందుకు వచ్చిందని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జ్యోతిరావు పూలే ద్విశత జయంతి ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన కమిటీలో మంద కృష్ణ మాదిగను సభ్యుడిగా చేర్చినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెర్క పర్శరాములు, దండు శంకర్, సామ్రాట్ ప్రకాష్, చుంచు రమేష్, జేరిపోతుల లక్ష్మణ్ మాదిగ, బింగి పవన్ కళ్యాణ్, బింగి నవీన్, ఎల్లయ్య, దండు కనుకయ్య, గుండుకాడి బాబు, చింతమడక పర్శరాములు, పొన్నాల కనుకయ్య, బింగి బాలకిషన్, బొత్త దుర్గయ్య, దాకాని కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా జేఏసీ చైర్మన్ దొంత నరేందర్
- కలెక్టరేట్ ఎదుట నిరసన




**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మెదక్ జిల్లా ఉద్యోగ ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) చైర్మన్ దొంత నరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భోజన విరామ సమయంలో భాగస్వామ్య సంఘాలతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న మూడు విడతల కరువు భత్యాలు మాత్రమే విడుదలయ్యాయని తెలిపారు. నూతన ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల కరువు భత్యంతో పాటు గత ప్రభుత్వం 5 శాతం మధ్యంతర భృతితో పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు పే రివిజన్ కమిషన్‌పై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే కమిటీ నివేదికను తెప్పించి వెంటనే 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.13 వేల కోట్ల బకాయిలను యుద్ధ ప్రాతిపదికన విడుదల చేయాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులు తమ సొంత డబ్బులు ప్రభుత్వం నుంచి విడుదల కాక మనోవేదనకు గురై అనారోగ్యంతో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల వేతనాల నుంచి 1.5 శాతం, ప్రభుత్వం నుంచి 1.5 శాతం భాగస్వామ్యంతో మూలనిధి ఏర్పాటు చేసి ఉద్యోగుల ట్రస్ట్ ద్వారా నగదు రహిత ఆరోగ్య కార్డులు జారీ చేస్తామని పలుమార్లు సమావేశాలు నిర్వహిస్తూ కాలయాపన చేయడం తగదన్నారు. సాధారణ ఎన్నికల ముందు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. ఉద్యోగుల నిరసన నినాదాలతో కలెక్టరేట్ కార్యాలయం మార్మోగింది. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సెక్రటరీ జనరల్ విట్టల్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్‌కుమార్, ట్రెసా, పీఆర్‌టీయూ, ఎస్టీయూ, యూటీఎఫ్, టిపిటీఎఫ్, టిటీయూ, క్లాస్ ఫోర్త్, విశ్రాంత ఉద్యోగులు, డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు మహేందర్ గౌడ్, సతీష్ రావు, రాజగోపాల్ గౌడ్, పద్మారావు, యాదగిరి, శివయ్య, ప్రసాద్, శ్యాంసుందర్, చరణ్ సింగ్, సౌమ్య నాయక్, నరేష్ కుమార్, వెంకట్రామిరెడ్డి, రిజ్వాన్ అలీ, గోలి కుమార్, సాంసన్ జయకర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్, తంస రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరి, టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, జిల్లా సహాధ్యక్షులు ఇక్బాల్ పాషా, ఉపాధ్యక్షులు పజిలుద్దీన్, రఘునాథరావు, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, క్రీడల కార్యదర్శి గోపాల్, కార్యవర్గ సభ్యులు సతీష్, రామాయంపేట యూనిట్ అధ్యక్షుడు ప్రభాకర్, ఏడుపాయల వనదుర్గ కార్యదర్శి ప్రశాంత్, సేర్ప్ బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శి చంద్రహాస్, సహాధ్యక్షుడు శ్రీకాంత్, కోశాధికారి లింగప్ప, ఉద్యోగ సంఘ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, సురేష్, విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు జగదీష్ చంద్ర, సత్యనారాయణ, సాయిబాబా, రమేష్ బాబు, నరేందర్, సునీల్, మధుసూదన్, ఉద్యోగులు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# చట్టానికి లోబడి పాలన కొనసాగాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలని, ప్రతి సర్పంచ్ గ్రామానికి నాయకుడిగా వ్యవహరించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘం నిధులను సక్రమంగా వినియోగించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీలను మోడల్‌గా తీర్చిదిద్దాలని,




గ్రామాల్లో అన్ని రకాల మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు లేని గ్రామాల్లో కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక అధికారి, పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్ సమన్వయంతో గ్రామపంచాయతీలో పనులు సవ్యంగా కొనసాగాలని అన్నారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం అన్ని గ్రామాలకు అందించిందని తెలిపారు. వాటిని ఇతర శాఖల అధికారుల సమన్వయంతో సమర్థంగా వినియోగించాలని సూచించారు. నిధుల వినియోగంలో అక్రమాలకు తావులేదని స్పష్టం చేశారు. నిధులు సక్రమంగా వినియోగించకపోతే లేదా అక్రమాలు జరిగితే సర్పంచ్‌లు, కార్యదర్శులపై చర్యలు తీసుకోవడంలో వెనుకాడబోమని హెచ్చరించారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఈఈ మిషన్ భగీరథ సంపత్ కుమార్, గ్రిడ్ డీఈ నాగభూషణం, డీఎల్పీఓలు సాయిబాబు, తిరుపతి రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల ఐక్యతతో మెరుగైన వేతన ఒప్పందం



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

సీఐటీయూ చొరవతో కార్మికుల ఐక్యత ద్వారా మెరుగైన వేతన ఒప్పందం సాధ్యమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం తెలిపారు. మెదక్ జిల్లా చేగుంట మండలం చిన్న శివనూరు శివారులోని నియాపోలి పరిశ్రమ కార్మికుల వేతన ఒప్పందంపై సంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో శుక్రవారం సంతకాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏ. మల్లేశం మాట్లాడారు. కార్మికుల వేతన ఒప్పందం గడువు 2026 మార్చి 31తో ముగియగా, ఏప్రిల్ 12న యాజమాన్యంతో వేతన ఒప్పందంపై చర్చలు జరిగాయని తెలిపారు. ఆ ఒప్పందం ప్రకారం కార్మికులకు నెలకు గరిష్టంగా రూ.7,080, కనిష్టంగా రూ.6,000 వేతన పెంపుదల, నెలకు రూ.30 సర్వీస్ వెయిటేజ్, 1982 సిరీస్ ప్రకారం వి.డి.ఏను రూ.7 నుంచి రూ.8కు పెంచడం, ముగ్గురు క్యాజువల్ కార్మికులను పర్మనెంట్ చేయడం వంటి అంశాలపై ఒప్పందం కుదిరిందన్నారు. జిల్లాలో అనేక పరిశ్రమల్లో నెలల తరబడి చర్చలు జరిగే పరిస్థితి ఉన్నప్పటికీ, సీఐటీయూ ఒకే దఫాలో చర్చలు పూర్తి చేసి ఒప్పందం కుదిర్చడం జిల్లాలో రికార్డు అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల ఒకవైపు 12 గంటల పని విధానం అమలు చేస్తూ, ఉన్న కార్మికులను కాంట్రాక్ట్ కార్మికులుగా మారుస్తున్నారని విమర్శించారు. అయితే, క్యాజువల్ కార్మికులను పర్మనెంట్ చేసే చరిత్ర సీఐటీయూదేనని అన్నారు. జిల్లాలో అనేక పరిశ్రమల్లో కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ వంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పాత చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్స్ తీసుకురావడంతో ప్రైవేట్ యాజమాన్యాలు కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నాయని తీవ్రంగా దుయ్యబట్టారు. హక్కుల కోసం యూనియన్లు ఏర్పాటు చేసుకుని పోరాడటమే పరిష్కారం అని, పోరాడే కార్మికులకు సీఐటీయూ పూర్తి అండగా నిలుస్తుందని తెలిపారు. వేతన ఒప్పందంపై యాజమాన్యం తరపున పరిశ్రమ యజమాని దక్షిత్ మోర్, ప్రతినిధి ఆదర్శ్, నియాపోలి ఇండస్ట్రీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) తరపున జిల్లా కార్యదర్శి, యూనియన్ అధ్యక్షుడు ఏ. మల్లేశం, ప్రధాన కార్యదర్శి కె. నవీన్, ఉపాధ్యక్షుడు మురళి గౌడ్, సహాయ కార్యదర్శి మహేష్, కోశాధికారి శేఖర్, కార్మిక శాఖ తరపున డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రవీందర్ రెడ్డి సంతకాలు చేశారు.

## నర్సింగ్ కళాశాల సందర్శించిన చైర్‌పర్సన్

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ నర్సింగ్ కళాశాలను మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్ శుక్రవారం సందర్శించారు. కళాశాలలో నెలకొన్న సౌకర్యాల సమస్యలపై నిరసన తెలుపుతూ విద్యార్థినీలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సూచన మేరకు చైర్‌పర్సన్ రాధిక కళాశాలను సందర్శించి విద్యార్థులతో, కళాశాల సిబ్బందితో మాట్లాడారు. నర్సింగ్ హాస్టల్‌లో ఉన్న సమస్యలపై చర్చించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, అవసరమైన సహకారం అందిస్తామని ఆమె తెలిపారు.



## జిల్లా ఆసుపత్రిలో నిలిచిపోయిన ఎక్స్ రే సేవలు

- రోగుల ఆవేదన






**ముద్ర ప్రతినిధి- నాగర్ కర్నూల్ :**

నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో ఎక్స్‌రే సేవలు నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత రెండు రోజులుగా ఎక్స్‌రే యంత్రం పనిచేయకపోవడంతో చికిత్స కోసం వచ్చే సాధారణ రోగులు మాత్రమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాల బాధితులు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా ఆసుపత్రికి అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల నుండి నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. అయితే వైద్య నిర్ధారణలో కీలకమైన ఎక్స్‌రే సేవలు అందుబాటులో లేకపోవడంతో, రోగులు తప్పనిసరిగా ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వారికి అదనపు ఆర్థిక భారం పడుతోంది. ఈ సమస్యపై ఆసుపత్రి అధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ, వారు అందుబాటులోకి రాకపోవడం గమనార్హం. వెంటనే సమస్యను పరిష్కరించి ఎక్స్‌రే సేవలను పునరుద్ధరించాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

## అంత్యక్రియలకు ఆర్థికసాయం

**ముద్ర, తాండూర్:**

యలాల్ మండలం బండమీదిపల్లి గ్రామంలో శుక్రవారం మృతిచెందిన రేగొండి నర్సిములు(50) అంత్యక్రియలకు తాండూరు కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ సంపత్ కుమార్ బీవీజీ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం పంపించారు. గ్రామ సర్పంచ్ బెస్త నరేష్ తాను కొంత డబ్బును కలిపి అంత్యక్రియల నిర్వహణకు అందజేశారు.

## అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు

**ముద్ర, జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**

పేదల సొంతింటి కళ నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అధికారుల నిర్లక్ష్యంతో అభాసుపాలవుతోంది. ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాల్సి ఉండగా, అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడంపై గద్వాల మండలం బసాపురం గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు గ్రామస్థాయిలో ఇందిరమ్మ కమిటీలు తయారు చేసిన జాబితాను తహసీల్దార్, ఎంపీడీవో, ఇంజినీర్లతో కూడిన మండల స్థాయి బృందం క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి ధ్రువీకరించాల్సి ఉంది. కానీ, అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా అధికార పార్టీ నాయకులు సూచించిన వారి పేర్లతో జాబితాను తయారు చేసినట్లు తెలుస్తోంది. దీంతో నిరుపేదలకు దక్కాల్సిన ఇళ్లు.. అనర్హులకు మంజూరు చేశారమి గ్రామస్తులు ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వ్యక్తి పేరు మీద వ్యవసాయ పొలం ఉందని, వాళ్లింట్లో ఒకరు ఉద్యోగం కూడా చేస్తున్నారన్నారు. గద్వాల ఎంపీడిఓకు ఫిర్యాదు చేసిన ఏ మాత్రం చర్యలు తీసుకోలేదు. దీంతో జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఇండ్లు లేని నిరుపేదలు చాలమంది ఉన్నారని, ఇప్పటికి పూరి గుడిసెలో నివసిస్తున్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## ఉద్యమ్ నమోదుతో లాభాలు

**ముద్ర న్యూస్ :**

ఉద్యమ్ ఆధార్ నమోదుతో కుటీర పరిశ్రమలు, దుకాణాల నిర్వాహకులకు మేలు జరుగుతుందని లింగంపేట ఎస్వీఈపీ ఏపీఎం రాజేందర్ తెలిపారు. శుక్రవారం లింగంపేట మండల సమాఖ్య కార్యాలయంలో ఉద్యమ్ ఆధార్ నమోదుపై ఐకేపీ సీసీలు, ఎస్వీఈపీ, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ్ ఆధార్ నమోదు ఉంటే రాయితీతో సులభంగా ఉపాధి రుణాలు పొందవచ్చన్నారు. దుకాణాలు నిర్వహిస్తున్న మహిళా సంఘాల సభ్యులు తప్పనిసరిగా ఉద్యమ్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

## నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

**ముద్ర న్యూస్ :**

దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం టీజీఈ జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లోని ఆయా పాఠశాలలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద వారు తహసీల్దార్లు సవాయి సింగ్, సువర్ణలకు వినతిపత్రాలు అందజేశారు. ఎంఈఓలు వెంకన్న చందర్, పీఆర్టీయూ మండల అధ్యక్షులు దుర్గాప్రసాద్, హన్మండ్లు, ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**పెళ్లికి కుటుంబ అనుకూలత**

ఇద్దరి కుటుంబాలు కలిసి పోగలవా అనే అంశం కూడా కీలకం.





# అన్ని వర్గాలకు అధికారమే ధ్యేయం


- **సామాజిక, సర్వోదయ తెలంగాణ కోసం పోరాటం చేస్తా**
- **ప్రతి కష్టాన్ని పాఠంగా నేర్చుకుంటూ కసిగా లక్ష్యంవైపు నడుస్తున్న**
- **కుల సంఘాలు ఏర్పాటు చేసింది మారోజు వీరన్నే**
- **జాగృతి అధ్యక్షురాలు కవిత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో అన్ని వర్గాలకు అధికారం దక్కాలన్నదే తన ధ్యేయమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ సాధించుకొని 12 ఏళ్లు గడిచినా, ఇప్పటికీ కనీసం గ్రామ వార్డు పదవి కూడా పొందని కులాలు ఎన్నో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ జాగృతి ఈ నెల 25 న ఏర్పాటు చేయబోతున్న పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు ప్రకటించింది. శుక్రవారం జాగృతి కార్యాలయంలో సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న, మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు కవితను కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. భౌగోళిక తెలంగాణ సాధించుకున్నప్పటికీ సామాజిక తెలంగాణ తెచ్చుకోలేకపోయామన్నారు. అన్ని వర్గాలకు అధికారం కోసం జాగృతి నిరంతరం పోరాటం చేస్తుందని ఆమె చెప్పారు. బీఆర్ఎస్ లో తాను ఎప్పుడైతే అన్ని వర్గాలకు అధికారం రావాలని కోరానో అప్పటి నుంచే తనకు కష్టాలు మొదలయ్యాయన్నారు. కానీ ఆ కష్టాలు తనలో కసిని పెంచాయన్నారు. వాటిని పాఠంగా నేర్చుకుంటూ సామాజిక తెలంగాణ కోసం ముందుకు కదులుతానన్నారు. 25 న తెలంగాణ తత్వం, సామాజిక కోణం రంగరించి తమ పార్టీ ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. కులాలు బలంగా ఉన్నప్పుడే వారికి రాజకీయ అధికారం దక్కుతుందని బలంగా నమ్మిన వ్యక్తి మారోజు వీరన్న కుల సంఘాలకు కర్త, కర్మ, క్రియ అని గుర్తు చేశారు. తాము పార్టీ పెట్టబోయే ముందు మారోజు వీరన్న అనుచరులు ఇచ్చే ధైర్యం మామూలుది కాదన్నారు. దీంతో సర్వోదయ తెలంగాణ కోసం ముందుకు కదులుతానని అన్నారు.

**మాజీ మావోయిస్టుల కోసం పోరాడుతాం**

తెలంగాణ ఉద్యమంలో మాజీ మావోయిస్టులు లక్ష మంది వరకు పాల్గొన్నారని అన్నారు. వారంతా బీఆర్ఎస్ లో చేరి ఆ పార్టీ బలంగా మారేందుకు చోదక శక్తి అయ్యారన్నారు. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వారెవరికీ కూడా మేలు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కోసం కూడా పోరాడుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులను కాంగ్రెస్ దారుణంగా వంచిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పీఆర్సీ అమలు చేస్తామని నమ్మబలికి ఇప్పుడు ఆ ఊసే ఎత్తటం లేదని మండిపడ్డారు. రిటైర్మెంట్ బకాయిలు చెల్లించకుండా ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు.





# ఇద్దరు వివాహితలు అదృశ్యం

**ముద్ర, కూకట్‌పల్లి :**

కుటుంబ సభ్యులు శుభకార్యానికి వెళ్లిన సమయంలో ఓ వివాహిత ఇంటి నుంచి అదృశ్యమైన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదర్ నగర్, నందమూరి నగర్‌కు చెందిన మహమ్మద్ ఖలీల్ మియా కుమార్తె రజియా బాను బేగం(25) ఆరు నెలలుగా తన తండ్రి వద్దే ఉంటోంది. వివాహం జరిగినప్పటికీ భర్తతో మనస్పర్థల కారణంగా ఆమె పుట్టింట్లో ఉంటూ, హైటెన్షన్ లైన్ సమీపంలోని ఒక బట్టల దుకాణంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది.

ఈ నెల 16న ఉదయం 7 గంటలకు కుటుంబ సభ్యులంతా జహీరాబాద్‌లో ఒక ఫంక్షన్‌కు వెళ్తుండగా, తలనొప్పిగా ఉందని చెప్పి రజియా ఇంటి వద్దే ఉండిపోయింది. సాయంత్రం 6 గంటల సమయంలో కుటుంబ సభ్యులు తిరిగి వచ్చేసరికి రజియా కనిపించకుండా పోయింది. ఆమెతో పాటు తన లగేజీ, వ్యక్తిగత సామాగ్రిని కూడా తీసుకువెళ్లినట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**పెరుగు తినమన్నందుకు ఇల్లాలు అదృశ్యం**

ముద్ర, కూకట్‌పల్లి: పెరుగు తినమని భర్త అన్నందుకు మనస్తాపానికి గురైన ఓ వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం గోరకొండకు చెందిన దాసరి శివకుమార్ (21) కెపిహెచ్‌బి కాలనీలోని షంషీగూడలో నివాసం ఉంటున్నాడు. ఇతడు డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శివకుమార్‌కు 2024 మే 28న రాజేశ్వరి (21)తో వివాహం జరిగింది. శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం రెండు రోజుల క్రితం భార్యతో ఆరోగ్యంగా ఉండేందుకు పెరుగు తినడం అలవాటు చేసుకో అన్న చిన్న మాటను మనసులో పెట్టుకున్న రాజేశ్వరి, అప్పటి నుంచి భర్తతో సరిగ్గా మాట్లాడటం లేదు. శుక్రవారం ఉదయం 7 గంటలకు శివకుమార్, అతని తల్లిదండ్రులు పని నిమిత్తం బయటకు వెళ్లారు. ఉదయం 10:20 గంటల సమయంలో తండ్రి ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళం వేసి ఉంది. శివకుమార్ వెంటనే ఇంటికి చేరుకుని పరిశీలించగా రాజేశ్వరి తన బట్టలు తీసుకొని వెళ్ళిపోయినట్లు గుర్తించారు. బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భర్త ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు. సబ్ ఇన్‌స్పెక్టర్ అవినాష్ బాబు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. రాజేశ్వరి ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.





# చెరువులు.. కుంటలు.. హాంఫట్

- **పాలమూరులో కబ్జాకోరల్లో జలాశయాలు**
- **చెరువులను చెరబట్టిన రియల్టర్లు**
- **బఫర్ జోన్, ఎఫ్ టీ ఎల్ పరిధిలో రియటర్ల భూ దందా**
- **బీఆర్ఎస్ హయాంలో విచ్చలవిడిగా ఆక్రమణలు**
- **కాపాడడంలో అధికారులు విఫలం**
- **ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్న వైనం**
- **ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

పాలమూరులో చెరువులు, కుంటలు అక్రమార్కుల చేతుల్లో బందీ అయ్యాయి. వీరిని అడ్డుకునేందుకు ఏ అధికారి ధైర్యం చేయలేదు. ఒక వేల ఏ అధికారి అయినా ముందుకు వస్తే అతనిపై వేధింపులు, ట్రాన్స్ ఫర్లు. అందుకే జిల్లా అధికారులు తమకేమి పట్టనట్లు ప్రభుత్వ చెరువులే కదా మనకెందుకులే అంటూ ఉదాసీనంగా ఉన్నారు. దీంతో భూకబ్జా రాయుళ్ళు మరింత చెలరేగిపోయి పాలమూరు పట్టణ సమీపంలో ని చెరువులు, కుంటలను చెరబట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో రూ.కోట్లు కొల్లగొట్టి నీటి వనరులు లేకుండా నాశనం చేశారు. వీరికి అప్పటి కలెక్టర్ కూడా అండగా ఉంటూ వచ్చారు. ఆ కలెక్టర్ పై తీవ్ర మైన ఆరోపణలు రావడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని స్థానిక బీఆర్ఎస్ నేతలు ఆ కలెక్టర్ ను ఇక్కడి నుంచి బదిలీ చేయించారు. ఈ అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు కూడా భయపడేవారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కబ్జాల పర్వం యథేచ్ఛగా సాగింది.

నడుం బిగించిన చెరువుల పరిరక్షణ సమితి ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ప్రస్తుతం చెరువుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చెరువులు, కుంటలు కాపాడేందుకు నడుం బిగించారు. వీటిని కాపాడాలని కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం మాత్రం ఇప్పటికీ కనిపించడం లేదు. అధికారుల నిర్లక్ష్యం, రియల్ ఎస్టేట్ ఒత్తిళ్లు కలిసి చెరువుల ఉనికినే ప్రమాదంలోకి నెట్టుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెరువుల భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న చెరువుల పరిమితులు ప్రస్తుత స్థితిలో కనిపించడం లేదని చెరువు సమీప ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురై ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఎఫ్ టీ ఎల్, బఫర్ జోన్‌లకు విరుద్ధంగా గృహ నిర్మాణాలు, లేఅవుట్లు వేగంగా పెరుగుతున్నాయి. భవిష్యత్తులో భారీ వరదల ప్రమాదానికి దారి తీసే అవకాశం ఉంది.

చెరువులపై రియల్టర్ల కన్ను

రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువుల భూములపై కన్నేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. చెరువుల ఆక్రమణలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని ప్రజలు చెబుతున్నారు. చెరువుల రక్షణ కోసం చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి జిల్లాలో చెరువుల విస్తీర్ణం



గణనీయంగా తగ్గింది. మరికొన్ని ప్రాంతాల్లో పూర్తిగా చెరువుల ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. చెరువులపై జరిగిన ఆక్రమణలను వెంటనే తొలగించాలని, ఎఫ్ టి ఎల్,బఫర్ జోన్‌లను స్పష్టంగా గుర్తించాలని, పూర్తి స్థాయి సర్వే నిర్వహించి చెరువుల అసలు సరిహద్దులను పునరుద్ధరించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

**మోదుగుంటలో 20 ఎకరాల భూమికి ఎసరు**

పాలమూరు పట్టణ నడిబొడ్డున లోని ఏనుగొండ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న మోదుగుంట చెరువు భూములపై భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెలువడుతున్నాయి. చెరువు శిఖం, ఎఫ్టీఎల్ పరిధిలోని భూములను రియాల్టర్లు 20 ఎకరాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ చెరువుకు సంబంధించిన సర్వే నెంబర్లు 294, 292, 296, 298, 295 402 ఎఫ్ టీ ఎల్ పరిధిలో ఉండాల్సి ఉంది. అయితే గతంలో పంచాయతీరాజ్ శాఖ నుంచి నీటిపారుదల శాఖకు బదిలీ సమయంలో రికార్డులు తారుమారైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ పరిస్థితిని ఆసరాగా చేసుకొని కొందరు పట్టాదారులు కోర్టులను ఆశ్రయించి తమకు అనుకూలంగా తీర్పులు పొందినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చెరువు విస్తీర్ణం కేవలం ఐదు ఎకరాలకే పరిమితమైందని పేర్కొంటూ మిగిలిన భూములను ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువు మధ్యలో రహదారి కోసం మట్టి నింపడంతో అది రెండు భాగాలుగా విడిపోయిందని స్థానికులు చెబుతున్నారు. అలాగే చెరువు శిఖం ప్రాంతంలోనే గతంలో జేజేఆర్ గార్డెన్ పేరుతో ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టారనే ఫిర్యాదులు కూడా అధికారులకు వెళ్లాయి. అయినా చర్యలు శూన్యం. ప్రస్తుతం బఫర్ జోన్ లో ఉన్న భూమిని కూడా ఆక్రమించారు. వీటిలో కొత్త నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఏనుగొండ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసినా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదు. ప్రభుత్...

# రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

- **అదనపు డీఐజీ స్వాతి లక్రా**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని అదనపు డీఐజీ స్వాతి లక్రా అన్నారు. 99 రోజుల పాటు నిర్వహించే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీసాయి దంత వైద్య కళాశాలలో "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, అత్యవసర సమయాల్లో సీపీఆర్ చేయడంపై అవగాహన కార్యక్రమాన్ని అదనపు డీజీపీ స్వాతి లక్రా, కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహమేహర జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు డీజీపీ స్వాతి లక్రా మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యపానం సేవించి అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి నుంచి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆమె తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని కారణంగా అదే విధంగా నిబంధనలు పాటించకుండా డ్రైవింగ్ చేసే క్రమంలో రోడ్డు ప్రమాదాల్లో తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. ఎదుటివారి తప్పిదాల వల్ల కూడా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని దీన్ని దృష్టిలో పెట్టుకుని వాహనాలను వేగంగా నడపకూడదని ఆమె సూచించారు. సోషల్ మీడియాలో వస్తున్న సామాజికపర అంశాలను తెలుసుకొని అందరికీ చేరవేసే విధంగా యువత బాధ్యత తీసుకొని అవగాహన కల్పించాలని సూచించారు. సీపీఆర్ పై అందరికీ తెలిసేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ రోడ్డు ప్రయాణాల్లో గమ్యం ముఖ్యం కాదని విలువైన జీవితం ముఖ్యమనే విషయాన్ని గుర్తించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో 2025 సంవత్సరానికి లక్ష 50 వేల మంది మరణించారని తెలిపారు. కుటుంబ యజమాని మరణించినట్లయితే ఆ కుటుంబం ఎంతగానో నష్టపోతుందని తెలిపారు. డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు అరికట్టవచ్చని అన్నారు. జిల్లాలో రోడ్డు భద్రత కమిటీలను వేయడం జరిగిందని, ప్రతి నెల రోడ్డు భద్రతపై సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాల జరుగుతున్నాయన్నారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అన్నారు. వాహనం నడిపే సమయంలో స్పష్టమైన కంటిచూపు ఉండటం అత్యంత అవసరమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని అన్నారు. ఉచిత శిబిరాలను ఏర్పాటు చేసి డ్రైవర్లందరికీ కంటి పరీక్షలు నిర్వహించి కళ్ళ అద్దాలను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ముందుగా దంత వైద్య కళాశాల విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన శాస్త్రీయ నృత్యాలు, డ్రగ్స్ తీసుకుంటే కలిగే అనర్థాలపై చేసిన నాటక ప్రదర్శనలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై తీసిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. అత్యవసర సమయాల్లో సేవలందించిన 108 సిబ్బంది పవన్ కుమార్, వైద్య రంగంలో ఉత్తమ సేవలందిస్తున్న డాక్టర్ సౌమ్య, డాక్టర్ రోహిత్, పోలీస్ కళాజాత బృందం అశోక్ ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, వైస్ ప్రిన్సిపాల్ సంపత్ రెడ్డి, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# ఆబ్కారీ భవన్ లో పీఆర్‌సీ కోసం ఉద్యోగుల నిరసన

**ముద్ర, హైదరాబాద్:**

పీఆర్సీతోపాటు ఇతర సమస్య లను పరిష్కారించాలని కోరుతూ తెలంగాణ ఉద్యోగ జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతో పాటు పెన్షనర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం ఆబ్కారీ భవన్‌లో పని చేసే ఉద్యోగులు, ఎక్సైజ్ యూనియన్లు కలిసి భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శించారు. 51% ఫిట్‌మెంట్ తో వెంటనే పీఆర్‌సీని ప్రకటించాలని, ఉద్యోగులకు 13 వేల కోట్ల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుచేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. టీజీఈజేఏసీ కేంద్ర సంఘ నాయకులు ఇచ్చిన కార్యాచరణలో తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆబ్కారీ ఉద్యోగులు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శి టి. లక్ష్మణ్ గౌడ్, ఎంఆర్‌పీ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం అధ్యక్షుడు కార్యదర్శి సూర కృష్ణ, చిరంజీవి, మధుబాబు, మినిస్టీరిల్ అధ్యక్ష కార్యదర్శులు జ్ఞానేశ్వర్, అనిల్ కుమార్, తిరుపతి, మహేందర్ రావు పటేల్‌తోపాటు ఆబ్కారీ భవన్‌లోని వేలాది మంది ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో ఎలక్ట్రిషియన్ మృతి

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**

నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం యంగంపల్లి గ్రామంలో వడదెబ్బకు గురై ఎలక్ట్రిషియన్ అంజనేయులు మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం అంజనేయులు రోజంతా ఎండలో పని చేసి ఇంటికి చేరిన అనంతరం అస్వస్థతకు గురయ్యారు. అనంతరం చల్లని నీటితో స్నానం చేసిన తర్వాత ఆయన ఆరోగ్యం మరింత విషమించింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి చేరుకునేలోపే అంజనేయులు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 18-04-2026
www.mudranews.in | @mudranews



**పెళ్లికి సామాజిక ఒత్తిడి**
సమాజం చెబుతుంది కాబట్టి పెళ్లి చేసుకోవడం తప్పు. మీ సమయం మీరే నిర్ణయించాలి.

ఢిల్లీలో రేవంత్ రెడ్డితో
## టీడీపీ మహిళా నేతల భేటీ

- రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ
- ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసిన పరిటాల సునీత తదితరులు



ముద్ర, న్యూఢిల్లీ:

న్యూ ఢిల్లీలో ఒక ఆసక్తికర రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డిని, ఏపీకి చెందిన టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత సహా పలువురు మహిళా ఎంపీలు, ఎమ్మెల్యేలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలను పరిటాల సునీత తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేయడంతో అవి వైరల్ అయ్యాయి. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలపై చర్చించేందుకు ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరుగుతున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల కోసం వివిధ పార్టీల నేతలు ఢిల్లీకి చేరుకున్నారు. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ ప్రాంగణంలో రేవంత్ రెడ్డి, టీడీపీ మహిళా ఎమ్మెల్యేల మధ్య ఈ సమావేశం జరిగింది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. ప్రస్తుతం టీడీపీ కేంద్రంలో ఎన్డీఏ కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉండగా, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమిలో కీలకపాత్ర పోషిస్తోంది. ఇలా భిన్న రాజకీయ ధ్రువాలకు చెందిన నేతలు కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అయితే, రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ ఫైర్ బ్రాండ్ ఎమ్మెల్యేగా కొనసాగిన నేపథ్యంలో పాత పరిచయాల కారణంగానే మర్యాదపూర్వక భేటీ అని భావిస్తున్నారు.

# కాళేశ్వరం పనులు మొదలెట్టారు..

- కాళేశ్వరం పనుల కోసం 'స్టీరింగ్ కమిటీ'
- బ్యారేజీల పునరుద్ధరణకు కల్నల్ మెహ్రా కమిటీ
- కాళేశ్వరం మరమ్మతులపై ప్రభుత్వం స్పీడ్
- మే 30లోగా బ్యారేజీలకు కీలక పరీక్షలు



ముద్ర, తెలంగాణ బ్యూరో;

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని కీలక బ్యారేజీల పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు, శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు భారీ కసరత్తును ప్రారంభించింది. అందులో భాగంగా పనుల సమన్వయం, పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. నీటిపారుదల, టన్నెలింగ్ నిపుణుడు, రిటైర్డ్ ఆర్మీ అధికారి కల్నల్ పరిక్షిత్ మెహ్రా కన్వీనర్‌గా ఈ కమిటీని ఏర్పాటు చేశారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను సమన్వయం చేయడం, నిర్ణీత కాలవ్యవధిలో ప్రాజెక్టును తిరిగి వినియోగంలోకి తీసుకు రావడం ఈ కమిటీ పని. వారానికి రెండు సార్లు సమావేశమై పురోగతిని ఈ కమిటీ సమీక్షిస్తుంది. ప్రతి రోజూ జరిగే పనులపై రోజువారీ పురోగతి నివేదికలను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.

### 30 లోపు కసరత్తు పూర్తి..

వర్షాకాలం ప్రారంభం కాకముందే కీలకమైన పరీక్షలు పూర్తి చేయాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించింది. బ్యారేజీల పునాదుల పటిష్టతను తెలుసుకోవడానికి మే 30వ తేదీ లోపు జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు పూర్తి చేయాలని ఆదేశించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడ్ల్యూసి), నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనలు, అనుమతుల మేరకు మాత్రమే ఈ మరమ్మతు పనులు సాగనున్నాయి. ముందుగా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, మేడిగడ్డను పాక్షికంగానైనా వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ తో మంత్రి 'ఉత్తమ్' భేటీ

ముద్ర, న్యూ ఢిల్లీ:

ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర నీటిపారు దల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ అనిల్ జైన్ తో భేటీ అయ్యారు. బ్యారేజీల రిపేర్లు, పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణ ప్రణాళికను చర్చించారు. గతంలో జరిగిన లోపాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న ముందు జాగ్రత్తలను వివరించారు. అన్ని కోణాల్లో నిపుణుల ఆధ్వర్యంలో ప్రస్తుతం పరీక్షలు చేపడుతున్న తీరుపై ఎన్డీఎస్ ఏ ఛైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే తాను స్వయంగా బ్యారేజీల సందర్శనకు వస్తానని చెప్పారు.

### బ్యారేజీలను శాస్త్రీయ పద్ధతుల్లో బాగు చేస్తం

**- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

గత ప్రభుత్వ లోపాల వల్ల దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను శాస్త్రీయ పద్ధతుల్లో బాగు చేయడమే తమ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందు కోసం ఎన్ డీఎస్ఏ, సీడబ్ల్యూసీ అధికారులతో సమన్వయం చేసు కుంటూ, ముంబయిలోని ఐఐటి నిపుణుల సహకారంతో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ నెలాఖరులోగా భూసార పరీక్షలు పూర్తిచేసి, వర్షాకాలం తర్వాత శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. పారదర్శకత కోసం ప్రత్యేక కో-ఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశామన్న ఉత్తమ్... సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా బ్యారేజీలను క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని వెల్లడించారు.

## ఏరోస్పేస్ కు కేంద్రంగా తెలంగాణ

- మంత్రి శ్రీధర్ బాబు



ముద్ర, తెలంగాణ బ్యూరో:

భవిష్యత్తు ఏరోస్పేస్ రంగ అవసరాలకు అనుగుణంగా తెలంగాణను దేశానికే వ్యూహాత్మక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఆర్ అండ్ డీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్టిఫికేషన్ అనే మూడు అంశాలను అనుసంధానించడం ద్వారా ఏరోస్పేస్ రంగంలో గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని రాష్ట్రం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. గచ్చిబౌలిలో జరిగిన 'ది ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా' జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో అత్యధిక సంఖ్యలో సైంటిస్టులు ఉన్నప్పటికీ, ల్యాబ్‌లలో జరిగే పరిశోధనలు కేవలం 30 శాతం మాత్రమే వాణిజ్య ఉత్పత్తులుగా మారుతున్నాయని చెప్పారు, ఆ అంతరాన్ని తగ్గించడమే తమ ప్రభుత్వ సంకల్పమని శ్రీధర్ బాబు అన్నారు. రాబోయే 20 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా 42 వేల కొత్త ఎయిర్‌క్రాఫ్ట్‌ల అవసరం ఉంటుందని అన్నారు. ఈ భారీ డిమాండ్‌ను అందుకోవడానికి హైదరాబాద్‌లోని 1,500కు పైగా ఎంఎస్‌ఎంఈలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు, 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయని కొనియాడారు. ప్రస్తుతం ఏరోస్పేస్ టెస్టింగ్, సర్టిఫికేషన్ కోసం విదేశాలపై ఆధారపడటం వల్ల సమయం, ఖర్చు పెరుగుతున్నాయని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి సర్టిఫికేషన్ ఎకో సిస్టమ్ అభివృద్ధికి కేంద్రం చొరవ చూపాలని మంత్రి కోరారు. డ్రోన్లు, ఏఐ ఏవియానిక్స్, 3డీ ప్రింటింగ్, రీయూజబుల్ రాకెట్లు వంటి అధునాతన అంశాల్లో తెలంగాణను ముందంజలో ఉంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సారస్వత్, డీజీ సీఎస్ఐఆర్ డీ.ఎన్ కళైసెల్వి, ప్రముఖ శాస్త్రవేత్తలు డాక్టర్ సతీష్ రెడ్డి, డాక్టర్ సోమనాథ్, తదితరులు పాల్గొన్నారు. ఏరోస్పేస్ రంగంలో విశేష కృషి చేసిన పలువురు శాస్త్రవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు సత్కరించారు.

## ఎంపీ తేజస్వీపై కేసు పెట్టే అవకాశం లేదు

- న్యాయపరమైన సలహా తీసుకుంటాం
- మంత్రి పొన్నం నుంచి ఫిర్యాదు అందింది
- డీజీపీ శివధర్ రెడ్డి



ముద్ర, కరీంనగర్:

లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ విభజనను ఇండియా-పాకిస్థాన్‌తో పోల్చిన ఎంపీ తేజస్వీ సూర్యపై ప్రస్తుతానికి కేసు పెట్టే అవకాశం లేదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో న్యాయపరమైన సలహా తీసుకుంటామని స్పష్టం చేశారు. శుక్రవారం కరీంనగర్‌లో రవాణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతకు సంబంధించి 'అరైవ్-అలైవ్' కార్యక్రమంలో డీజీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ తేజస్వీ సూర్యపై చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి తనకు లేఖ అందిందని చెప్పారు. తేజస్వీపై చర్యల విషయంలో న్యాయసలహాలు పాటించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. రోడ్డు భద్రతను ఒక సామాజిక బాధ్యతగా భావించి 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలతో సుమారు 1.74 లక్షల మంది ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరమని శివధర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం తీసుకున్న కఠిన చర్యల వల్ల గత మూడు నెలల్లోనే రోడ్డు ప్రమాద మరణాలు 330 వరకు తగ్గాయని వెల్లడించారు. ఈ కార్యక్రమాలను డిసెంబర్‌లో ప్రారంభించి, జనవరిలో ముఖ్య మంత్రి చేతుల మీదుగా మరింత వేగవంతం చేశామన్నారు. గ్రామాల్లో ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులు, వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ఇది ప్రతి ఒక్కరి ప్రాణాలకు సంబంధించిన విషయమని ఆయన కోరారు.

### తెనాలిలో న్యూడ్ చాటింగ్.. కేసు నమోదు

ముద్ర అమరావతి:

తెనాలి కేంద్రంగా సాగిన 'న్యూడ్ చాటింగ్'పై త్రీ టౌన్ పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పట్టణ పాండురంగపేటలోని ఒక ఇల్లు కేంద్రంగా 44, 54 సంవత్సరాల మహిళలు ఇద్దరు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తమను కోరుకున్న వారితో న్యూడ్ చాటింగ్ చేస్తున్నారు. ఈ మహిళల్లో ఒకరి కుమారుడైన సాయి అనే వ్యక్తి ఇందుకు సహకరిస్తున్నాడు. ఈ వ్యవహారంపై అందిన సమాచారంతో పోలీసులు సుమోటోగా దర్యాప్తు చేశారు. గత కొన్ని రోజులుగా పలువురిని విచారించారు. అనంతరం న్యాయ నిపుణుల సలహా తీసుకొని కేసు నమోదు చేశారు. ఈ తరహా అంశంపై కేసు నమోదు కావడం జిల్లాలో ఇదే ప్రథమమని పోలీసులు చెబుతున్నారు. నిందితుడు సాయి కోసం వెతుకుతున్నారు.

## హోర్మూజ్‌పై ఇరాన్ కీలక ప్రకటన




ముద్ర, డెస్క్:

పశ్చిమాసియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హోర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచినట్లు ఇరాన్ ప్రకటించింది. అన్ని వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతించనున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. లెబనాన్‌తో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హోర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా-ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హోర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తి స్థాయిలో నౌకల రాకపోకలు కొనసాగనున్నాయని తెలిపారు. ఇరాన్‌కు ధన్యవాదాలు చెప్పారు.

## జూన్ 2 లోగా పీఆర్సీ అమలు చేయాలి

- ప్రభుత్వానికి ఉద్యోగుల జేఏసీ అల్టిమేటం

ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణ ఉద్యోగులందరికీ జూన్ రెండో తేదీ నాటికి పీఆర్సీ అమలు చేయాలని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వోడ్నాల రాజశేఖర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మండల, డివిజన్ కేంద్రాల్లో వినతి పత్రాలు సమర్పించారు. ఈ క్రమంలో జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. రిటైరైన ఉద్యోగులకు పెండింగ్ బిల్స్ అన్నీ క్లియర్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డులను వెంటనే అమలు చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత నియామకమైన ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని, పెండింగ్ బిల్లులతో పాటుగా పెండింగ్ డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 61 ఏండ్లు నిండిన వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సాధారణ బదిలీలు చేపట్టాలని, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



## సమ్మె విరమిస్తున్నాం..

- విద్యుత్ శాఖ ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి



ముద్ర, తెలంగాణ బ్యూరో:

రాష్ట్రంలో ఆర్టిజన్లు సమ్మె విరమించారు. ట్రాన్స్కో సీఎండీతో సమస్యలపై చర్చించేందుకు డిప్యూటీ సీఎం ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని నిర్ణయించినట్టు ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ లోని ప్రజా భవన్ లో ఆర్టిజన్ల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేశమయ్యారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎంకు ఆర్టిజన్ల జేఏసీ కన్వీనర్ సాయిలు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంభట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలను మెప్పించే పనులు చేయాలని, సమ్మెపై బ్యాన్ ఉన్నదని తెలిసి, వేసవిలో విద్యుత్తు డిమాండ్ పీక్ స్థాయిలో ఉండే ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైనది కాదని డిప్యూటీ సీఎం తెలిపారు. చర్చల ద్వారానే సమస్యల9 పరిష్కారమవుతాయని తెలిపారు. సమస్యలపై ఆర్టిజన్ల జేఏసీతో ట్రాన్స్కో సీఎండీ చర్చలు జరుపు తారని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు.

ఈ చర్చల్లో ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆర్టిజన్ల కో చైర్మన్లు చంద్రారెడ్డి, శ్రీధర్ గౌడ్, చందర్ సింగ్ ఠాకూర్, వైస్ చైర్మన్ సంతోష్, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
18.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**పెళ్లికి వయస్సు గైడ్‌లైన్**

సాధారణంగా 25–30 మధ్య వయస్సు అనుకూలంగా భావిస్తారు. కానీ ఇది కేవలం ఒక సూచన మాత్రమే.



# రోహిత్ శర్మ ... టార్గెట్ 2027 వరల్డ్ కప్



- ఫిట్‌నెస్‌పై దృష్టి పెడుతున్న టీమిండియా ఓపెనర్
- కెరీర్‌ను డిసైడ్ చేయనున్న రాబోయే సిరీస్‌లు

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:
టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ మరోసారి ప్రపంచ వేదికపై తన ముద్ర వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2027 వన్డే వరల్డ్ కప్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా సిద్ధమవుతున్నట్లు సమాచారం.
39 ఏళ్ల వయసుకు చేరువవుతున్నప్పటికీ రోహిత్ ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి తన ఆటతీరు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. 2023 వరల్డ్ కప్ ఫైనల్‌లో ఎదురైన ఓటమి అనుభవం అతనిలో ఇంకా ప్రభావం చూపుతున్నట్లు భావిస్తున్నారు.
ప్రస్తుతం ఐపీఎల్ సీజన్‌లో హామ్‌స్ట్రింగ్ గాయంతో కొంత ఇబ్బంది పడుతున్నప్పటికీ, దీర్ఘకాల లక్ష్యంగా ఉన్న 2027 వరల్డ్ కప్‌పైనే పూర్తి దృష్టి పెట్టినట్లు సమాచారం.
రోహిత్ చిన్ననాటి కోచ్ దినేష్ లాడ్ మాట్లాడుతూ, వయసు పెరిగినా రోహిత్ ఫీల్డింగ్, రన్నింగ్‌లో ఇంకా చురుకుదనం చూపిస్తున్నాడని తెలిపారు. అతనిలో ఆట పట్ల నిబద్ధత ఏమాత్రం తగ్గలేదని పేర్కొన్నారు.
మాజీ చీఫ్ సెలెక్టర్ దిలీప్ వెంగ్‌సర్కార్ కూడా రోహిత్ అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఫిట్‌గా ఉన్నంత వరకు అతనిని జట్టులో కొనసాగించడం సరైన నిర్ణయమని తెలిపారు.
మరోవైపు సునీల్ గవాస్కర్ వంటి మాజీ దిగ్గజాలు కూడా వయసు కంటే ఫామ్, ఫిట్‌నెస్ ముఖ్యమని గత ఉదాహరణలు చూపిస్తూ రోహిత్‌కు మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తోంది.
ఇక వచ్చే నెలల్లో జరిగే వన్డే సిరీస్‌లు రోహిత్ కెరీర్‌ను నిర్ణయించడంలో కీలకంగా మారనున్నాయి. ఆ మ్యాచ్‌లలో స్థిరమైన ప్రదర్శన కనబరిస్తే 2027 వరల్డ్ కప్ ప్రణాళికల్లో స్థానం ఖాయమయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# అగ్రస్థానంలో పంజాబ్ కింగ్స్ జోరు

- నాలుగు విజయాలతో పాయింట్ల పట్టికలో టాప్

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:
ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు అద్భుతమైన ఫామ్‌తో ప్రత్యర్థులను ఆశ్చర్యపరుస్తోంది. ఇప్పటివరకు ఆడిన ఐదు మ్యాచ్‌లలో నాలుగు విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. గత సీజన్లలో ఎదురైన నిరాశను తుడిచిపెట్టేసి, ఈసారి బలమైన జట్టుగా నిలుస్తోంది.
ముంబై ఇండియన్స్‌పై సాధించిన కీలక విజయం జట్టుకు మరింత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఆ మ్యాచ్‌లో జట్టు ప్రదర్శన అన్ని విభాగాల్లో సమతుల్యంగా ఉండటంతో పంజాబ్ కింగ్స్ ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది.
జట్టు విజయాల్లో కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోంది. మైదానంలో తీసుకుంటున్న నిర్ణయాలు, ఆటగాళ్లను సమర్థంగా ఉపయోగించుకోవడం జట్టు విజయానికి ప్రధాన కారణంగా మారుతున్నాయి. ప్రధాన కోచ్ రికీ పాంటింగ్ వ్యూహాలు కూడా జట్టుకు బలంగా నిలుస్తున్నాయి. బ్యాటింగ్ విభాగంలో ప్రభ్‌సిమ్రన్ సింగ్ నిలకడగా రాణిస్తుండగా, బౌలింగ్ విభాగంలో అర్ష్‌దీప్ సింగ్ సంధిస్తున్న యార్కర్లు ప్రత్యర్థులకు సవాలుగా మారుతున్నాయి. ఫీల్డింగ్‌లోనూ జట్టు సమిష్టిగా రాణిస్తూ మ్యాచ్‌లపై పట్టు సాధిస్తోంది.
జట్టు యజమాని ప్రీతి జింటా ఆటగాళ్ల ప్రదర్శనపై సంతోషం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇలాంటి టీమ్ ఎఫర్ట్ కొనసాగితే ఈ సీజన్‌లో టైటిల్ సాధించే అవకాశాలు ఉన్నాయని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.



# రికార్డు ముంగిట వైభవ్ సూర్యవంశీ

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:
ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ అద్భుత ఫామ్‌తో దూసుకుపోతున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం చూపిస్తూ రికార్డుల వేట కొనసాగిస్తున్నాడు.
తాజా గణాంకాల ప్రకారం భారత టీ20 క్రికెట్‌లో అత్యంత వేగంగా 1000 పరుగులు పూర్తి చేసిన రికార్డు ప్రస్తుతం దేవదత్ పడిక్కల్ పేరిట ఉంది. అతను 25 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించగా, వైభవ్ ఇప్పటికే 23 ఇన్నింగ్స్‌లలో 901 పరుగులు పూర్తి చేశాడు.
ఈ క్రమంలో ఏప్రిల్ 19న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగే మ్యాచ్‌లో వైభవ్ మరో కీలక మైలురాయిని చేరే అవకాశం ఉంది. ఆ మ్యాచ్‌లో అతను 99 పరుగులు సాధిస్తే పడిక్కల్ రికార్డును అధిగమించి అత్యంత వేగంగా 1000 పరుగులు చేసిన భారత ఆటగాడిగా నిలిచే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన మ్యాచ్‌లో తక్కువ స్కోరుకే అవుట్ కావడంతో ఒక రికార్డు చేజారినప్పటికీ, ఈసారి చరిత్ర సృష్టించే అవకాశం మాత్రం ఇంకా సజీవంగానే ఉంది. ప్రస్తుత సీజన్‌లో వైభవ్ ఐదు ఇన్నింగ్స్‌లలోనే 200 పరుగులు సాధించి తన దూకుడు బ్యాటింగ్‌ను కొనసాగిస్తున్నాడు. అతని బ్యాట్ నుంచి పదునైన షాట్లు, భారీ సిక్సర్లు వస్తుండటంతో ప్రత్యర్థి బౌలర్లు ఇబ్బంది పడుతున్నారు.
అదే సమయంలో పరుగుల పట్టికలో విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో ఉండగా, వైభవ్ అతనికి సమీపంగా కొనసాగుతున్నాడు. రాబోయే మ్యాచ్‌లో మంచి ఇన్నింగ్స్ ఆడితే ఆరెంజ్ క్యాప్ రేసులో కూడా ముందుకు వెళ్లే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.
ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనున్న ఈ పోరు వైభవ్ కెరీర్‌లో కీలక ఘట్టంగా మారే అవకాశముందని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



# ప్రభ్‌సిమ్రన్ జోరు..

- పంజాబ్ విజయాల్లో కీలక పాత్ర
- దూకుడు ఆటతో యువ బ్యాటర్ల సరసన నిలుస్తున్న ఓపెనర్

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:
ఐపీఎల్‌లో యువ బ్యాటర్ల హవా కొనసాగుతున్న వేళ అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్, ఆయుష్ మాత్రే, ప్రియాంశ్ ఆర్య వంటి పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అయితే ఈ జాబితాలో మరో పేరు కూడా అదే స్థాయిలో నిలుస్తోంది. పంజాబ్ కింగ్స్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ దూకుడు ఆటతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. తొలి బంతి నుంచే ఎటాకింగ్ గేమ్ ఆడటం అతని ప్రత్యేకతగా మారింది. పంజాబ్ కింగ్స్ గత ఐపీఎల్ సీజన్‌లో ఫైనల్ చేరడంలో ఓపెనర్ల పాత్ర కీలకంగా నిలిచింది. ప్రస్తుత సీజన్‌లోనూ అదే జోరు కొనసాగుతోంది. ఐదు మ్యాచ్‌లలో నాలుగింట్లో విజయం సాధించిన పంజాబ్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరింది. ఒక మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఈ నాలుగు మ్యాచ్‌లలో ప్రభ్‌సిమ్రన్ ప్రదర్శన జట్టుకు బలంగా నిలిచింది. ముఖ్యంగా ముంబైపై 39 బంతుల్లో 80 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. అంతకుముందు సన్‌రైజర్స్‌పై 25 బంతుల్లో 51 పరుగులు సాధించాడు. ప్రస్తుతం అత్యధిక పరుగుల జాబితాలో 211 పరుగులతో ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు.

**నిలకడకు మారుపేరుగా..**

గత సీజన్‌లోనూ ప్రభ్‌సిమ్రన్ బ్యాట్ నుంచి కీలక ఇన్నింగ్స్‌లు వచ్చాయి. ఫైనల్ చేరిన పంజాబ్ జట్టులో రెండో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. 17 మ్యాచ్‌లలో 549 పరుగులు సాధించిన అతని స్ట్రైక్‌రేట్ 160.52గా నమోదైంది. పవర్‌ప్లేలో దూకుడుగా ఆడే ప్రభ్ ఈసారి మరింత నిలకడతో రాణిస్తున్నాడు. స్ట్రైక్‌రేట్‌ను తగ్గించకుండా పరుగులు సాధించడం అతని ప్రత్యేకతగా నిలుస్తోంది. మ్యాచ్ ముగిసే వరకూ క్రీజ్‌లో నిలబడే ప్రయత్నం పరిణతికి నిదర్శనమని జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రశంసించినట్లు సమాచారం.
పవర్‌ప్లేతో పాటు మిడిల్ ఓవర్లలోనూ ప్రభ్‌సిమ్రన్ స్ట్రైక్‌రేట్ ఆకట్టుకుంటోంది. నికోలస్ పూరన్, రజత్ పాటీదార్, శ్రేయస్ అయ్యర్ తర్వాత మంచి స్ట్రైక్‌రేట్ కలిగిన బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. దాదాపు ప్రతి 6.54 బంతులకు ఒక ఫోర్ సాధిస్తూ, సిక్స్‌లతో పాటు ఖాళీల్లో బంతిని పంపించే టెక్నిక్‌ను చూపిస్తున్నాడు.

**యువరాజ్ శిష్యుడిగా ఎదుగుదల**

టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ వద్ద శిక్షణ పొందిన ఆటగాళ్లలో ప్రభ్‌సిమ్రన్ కూడా ఒకరు. అభిషేక్ శర్మ మాదిరిగానే యువరాజ్ మార్గదర్శకత్వంలో తన ఆటను మెరుగుపరుచుకున్నాడు. యువరాజ్‌ను పెద్దన్నగా భావిస్తానని, ఎప్పుడైనా ఫోన్ చేసి సలహాలు తీసుకునే అవకాశం ఉందని పలు సందర్భాల్లో ప్రభ్‌సిమ్రన్ పేర్కొన్నాడు. 2019లో ఐపీఎల్‌లో అడుగుపెట్టిన ప్రభ్‌సిమ్రన్‌కు ఆరేళ్ల తర్వాత పెద్ద అవకాశాలు లభించాయి. గత సీజన్‌లో 500కు పైగా పరుగులు చేసి తన సామర్థ్యాన్ని నిరూపించాడు. ప్రస్తుత సీజన్‌లోనూ అదే జోరుతో కొనసాగుతున్నాడు.

**కుటుంబ మద్దతుతో ముందుకు**

పంజాబ్‌లోని పటియాలాలో 2000లో జన్మించిన ప్రభ్‌సిమ్రన్ కుటుంబం క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చింది. అతని తండ్రి సుర్జిత్ సింగ్‌కు కిడ్నీ సమస్యలు ఉండటంతో తరచూ డయాలసిస్ చేయించుకోవాల్సి వచ్చేది. తల్లి జస్బిర్ కౌర్ కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ పిల్లలకు అండగా నిలిచింది. ప్రభ్‌సిమ్రన్‌కు సోదరుడు అన్మోల్‌ప్రీత్ సింగ్ కూడా క్రికెటర్‌గా కొనసాగుతున్నాడు. కుటుంబం నుంచి లభించిన ప్రోత్సాహమే తన విజయానికి కారణమని ప్రభ్‌సిమ్రన్ పలు సందర్భాల్లో వెల్లడించినట్లు సమాచారం.

# వరుణ్ పుంజుకుంటాడు



- కార్తిక్ త్యాగి

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:*
ఐపీఎల్ 2026 సీజన్‌లో వికెట్ కోసం వరుణ్ చక్రవర్తి పరితపిస్తున్నాడు. బరిలోకి దిగిన మూడు మ్యాచ్‌లలో భారీగా పరుగులు సమర్పించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇవాళ గుజరాత్ టైటాన్స్‌తో కోల్‌కతా నైట్‌రైడర్స్ తలపడనున్న నేపథ్యంలో అహ్మదాబాద్ పిచ్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, ఈ మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి పుంజుకుంటాడని కేకేఆర్ యువ పేసర్ కార్తిక్ త్యాగి పేర్కొన్నాడు. మ్యాచ్‌కు ముందు నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో త్యాగి మాట్లాడాడు.
ప్రతి క్రికెటర్‌కూ ఇలాంటి దశ ఎదురవుతుందని, ఒక్కోసారి ప్రదర్శన బాగున్నప్పటికీ పిచ్ పరిస్థితులు ప్రభావం చూపుతాయని త్యాగి తెలిపాడు. ఇలాంటి పరిస్థితులు ఆటగాళ్లకు నేర్చుకునే అవకాశాన్ని కల్పిస్తాయని, మెరుగ్గా రాణించి అత్యుత్తమ బౌలర్‌గా మారేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించాడు. వరుణ్ కూడా ఇలాంటి దశలో ఉన్నాడని, తప్పకుండా బలంగా పుంజుకుంటాడని, గుజరాత్‌తో మ్యాచ్‌లోనే మంచి ప్రదర్శన ఇస్తాడని ఆశిస్తున్నట్లు వెల్లడించాడు. కొన్నిసార్లు అదృష్టం కూడా కలిసి రాకపోవచ్చని, జట్టుగా మరోసారి ఉత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రణాళికలను అమలు చేస్తామని తెలిపాడు.

**బోణీ కొడుతుందా?**

ఐపీఎల్ 2026 సీజన్‌లో ఇప్పటి వరకూ కోల్‌కతా నైట్‌రైడర్స్ విజయాల బోణీ కొట్టలేకపోయింది. జట్టు ఖాతాలో ఉన్న ఏకైక పాయింట్ కూడా వర్షం కారణంగా మ్యాచ్ రద్దు కావడం వల్ల వచ్చినదే కావడం గమనార్హం. గత మ్యాచ్‌లలో విజయానికి చేరువగా వచ్చినప్పటికీ అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయినట్లు తెలుస్తోంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
18.04.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## పెళ్లికి సంబంధాన్ని అర్థం చేసుకోవడం

పెళ్లి అంటే బాధ్యత, సమన్వ-యం, త్యాగం. ఈ విషయాలు అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే ముందుకు వెళ్లాలి.





# హెలికాప్టర్లో బాలయ్యతో డింపుల్ సెల్ఫీ

**ముద్ర, సినిమా డెస్క్:**

నటసింహం నందమూరి బాలకృష్ణ, నటి డింపుల్ హయాతి కలిసి గుంటూరులో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో సందడి చేశారు. లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన ఓ ప్రముఖ ఆభరణాల షోరూమ్ ప్రారంభోత్సవానికి బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరుకాగా, డింపుల్ హయాతి కూడా పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి గుంటూరుకు ఇద్దరూ ఒకే ప్రత్యేక హెలికాప్టర్‌లో చేరుకోవడం ప్రత్యేకంగా నిలిచింది.

హెలికాప్టర్ ప్రయాణ సమయంలో డింపుల్ హయాతి తీసుకున్న సెల్ఫీ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సాధారణంగా గంభీరంగా కనిపించే బాలకృష్ణ ఈసారి సరదాగా కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది.

ఇక సినిమాల విషయానికి వస్తే, బాలకృష్ణ ప్రస్తుతం 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో డింపుల్ హయాతి నటిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# ఐఎన్‌సీఏ అవార్డ్స్‌లో తెలుగు సినిమాల హవా

**ముద్ర, సినిమా డెస్క్:**




దేశంలోని వివిధ భాషల సినీ పరిశ్రమలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఇండియన్ నేషనల్ సినీ అకాడమీ (INCA) 2026 అవార్డుల ప్రదానోత్సవం ముంబయిలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు నటుడు, నిర్మాత రానా దగ్గుబాటి, నటి శ్రీయ శరణ్, నిర్మాత కరణ్ జోహార్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు సినీ పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు లభించింది.

'తండేల్' చిత్రంలో నటనకు గాను నాగచైతన్యకు ఉత్తమ నటుడు అవార్డు లభించగా, 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రానికి రష్మిక మందన్న ఉత్తమ నటి పురస్కారం అందుకున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రానికి అనిల్ రావిపూడి ఉత్తమ దర్శకుడిగా ఎంపిక కాగా, అదే చిత్రంలో నటించిన మాస్టర్ రేవంత్ ఉత్తమ హాస్య నటుడిగా అవార్డు అందుకున్నారు. ఇతర విభాగాల్లో రిషబ్ శెట్టి ('కాంతారా చాప్టర్ 1'), దుల్కర్ సల్మాన్ ('కాంత') ఉత్తమ నటులుగా గుర్తింపు పొందారు. సీనియర్ నటి సిమ్రన్, కళ్యాణి ప్రియదర్శన్ ఉత్తమ నటీమణులుగా ఎంపికయ్యారు. 'మిరాయ్' చిత్రం ఉత్తమ చిత్రంగా నిలవగా, అదే చిత్రానికి ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ అవార్డు దక్కింది. 'కోర్ట్' చిత్రానికి రామ్ జగదీష్ ఉత్తమ తొలి దర్శకుడిగా అవార్డు అందుకున్నారు. భారతీయ సినిమాకు చేసిన విశేష సేవలకు గాను కమల్ హాసన్, రేఖలకు ప్రత్యేక పురస్కారాలు అందజేశారు. వివిధ విభాగాల్లో తెలుగు చిత్రాలకు అధికంగా అవార్డులు దక్కడం పట్ల సినీ అభిమానులు సోషల్ మీడియాలో అభినందనలు తెలియజేస్తున్నారు.

# బాణామతి బ్యాక్‌డ్రాప్‌లో 'చేతబడి'.. ఆకట్టుకుంటున్న జేడీ చక్రవర్తి కొత్త సినిమా ట్రైలర్

**ముద్ర, సినిమా డెస్క్:**

జేడీ చక్రవర్తి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'చేతబడి' చిత్ర ట్రైలర్ తాజాగా విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. నిజ జీవిత ఘటన ఆధారంగా బాణామతి బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ చిత్రం హారర్, మిస్టరీ అంశాలతో ఉత్కంఠ రేకెత్తించేలా కనిపిస్తోంది.

ఈ చిత్రాన్ని ఎం3 మీడియా, మహా మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మహర్షి కూండ్ల సమర్పణలో సూర్యాస్ కథ, దర్శకత్వం వహిస్తుండగా మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ట్రైలర్‌లో జేడీ చక్రవర్తి ఇప్పటివరకు కనిపించని భిన్నమైన అవతార్‌లో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హీరోతో పాటు ప్రతినాయక ఛాయలు కలిగిన పాత్రలో ఆయన నటన ఆసక్తిని పెంచుతోంది.




సంగీతాన్ని అచ్చు రాజమణి అందిస్తుండగా, ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ ఈ చిత్రానికి పనిచేస్తున్నారు. సినిమాటోగ్రఫీని మిర్లాన్ నసీర్, ఎడిటింగ్‌ను వంశీ నిర్వహిస్తున్నారు. వచ్చే నెల నుంచి ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానున్నట్లు చిత్రబృందం తెలిపింది.

# నాన్న క్రమశిక్షణే స్ఫూర్తి: చరణ్ భావోద్వేగ వ్యాఖ్యలు



ముద్ర, సినిమా డెస్క్:

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్న 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది. మొదట ఏప్రిల్‌లో విడుదల చేయాలని భావించిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు మరింత మెరుగైన అనుభూతి అందించేందుకు జూన్‌కు వాయిదా వేసినట్లు సమాచారం.

ఇదిలా ఉండగా రామ్ చరణ్ అంతర్జాతీయ స్థాయిలో మరో గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రతిష్టాత్మక 'ఈ స్క్వైర్ ఇండియా' మ్యాగజైన్ కవర్‌పై చోటు దక్కించుకున్న తెలుగు హీరోగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యక్తిగత జీవితం, సినీ ప్రయాణానికి సంబంధించిన పలు విషయాలను వెల్లడించారు. తన తండ్రి చిరంజీవి ప్రభావం గురించి మాట్లాడిన చరణ్, తన జీవితంలో నిజమైన హీరో నాన్నేనని పేర్కొన్నారు. ఆయన సాధించిన స్థాయిని చేరుకోవడం సులభంగా కనిపించినప్పటికీ, ఆ స్థాయికి చేరేందుకు ఎంతో కష్టం చేశారని తెలిపారు. షూటింగ్‌ల సమయంలో రోజుకు నాలుగు గంటలకే పరిమితమైన నిద్రతో కూడా పనిచేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. ఎంతటి స్టార్‌డమ్ ఉన్నా ఇంట్లో మాత్రం సాధారణ తండ్రిలా ఉండటం చిరంజీవి ప్రత్యేకత అని తెలిపారు. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ కుటుంబానికి సమయం కేటాయించడంలో ఎప్పుడూ రాజీ పడలేదని వివరించారు. కష్టాల్లో ఉన్న సినీ పరిశ్రమకు చెందిన వారికి అండగా నిలిచే మనసు ఆయనలో ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. వృత్తి, కుటుంబ జీవితం మధ్య సమతుల్యత ఎలా ఉండాలో తండ్రిని చూసే నేర్చుకున్నానని చరణ్ వెల్లడించారు. ఎలాంటి అడ్డంకులు వచ్చినా ధైర్యంగా ముందుకు సాగే తత్త్వం తనపై గాఢమైన ప్రభావం చూపిందని తెలిపారు. కొద్దిసేపు విరామం దొరికినా కుటుంబంతో గడపడం ముఖ్యమని భావిస్తానని చెప్పారు.

# ఐఎన్‌సీఏలో రుక్మిణి హొయలు

**ముద్ర, సినిమా డెస్క్:**

తాజాగా నిర్వహించిన ఐఎన్‌సీఏ అవార్డ్స్ వేడుకలో యంగ్ హీరోయిన్ రుక్మిణి వసంత్ తన స్టైలిష్ లుక్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి సిల్వర్ రంగు స్లీవ్‌లెస్ డ్రెస్‌లో హాజరైన ఆమె, అందరి దృష్టిని ఆకర్షించింది.వేదికపై రుక్మిణి వసంత్ వివిధ భంగిమల్లో ఫోటోలకు పోజులు ఇవ్వగా, ఆమె లుక్ అభిమానులను ఆకట్టుకుంది. ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ చర్చనీయాంశంగా మారాయి.



# ఒంటరిగా జీవించడంలోనే ఆనందం: హన్సిక

**ముద్ర, సినిమా డెస్క్:**

నటి హన్సిక వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాలు ఇటీవల చర్చనీయాంశంగా మారాయి. 2022 డిసెంబర్ 4న జైపూర్‌లో వ్యాపారవేత్త సోహెల్ ఖతూరియాతో వివాహం చేసుకున్న ఆమె, కొంతకాలం తర్వాత వ్యక్తిగత కారణాలతో విడాకుల కోసం బాంద్రా ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. తాజాగా న్యాయస్థానం వీరి విడాకులకు అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల సోషల్ మీడియా ద్వారా అభిమానులతో మాట్లాడిన హన్సిక, ప్రస్తుతం తన జీవితంలో ప్రశాంతంగా ఉన్నట్లు వెల్లడించింది. స్వేచ్ఛగా జీవించడం తనకు ఎంతో ఇష్టమని, ఒంటరిగా గడపడం తనకు సంతృప్తిని ఇస్తుందని తెలిపింది. తనకు నచ్చిన పనులు చేసుకుంటూ, కుటుంబ సభ్యులతో సమయం గడపడం ఆనందంగా అనిపిస్తోందని పేర్కొంది.

హన్సిక చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో చర్చకు దారితీస్తున్నాయి.

# పాపం ప్రతాప్ మూవీ రివ్యూ

**ముద్ర, సినిమా డెస్క్:**

వైవిధ్యమైన కథలను ఎంపిక చేసుకుంటూ గుర్తింపు పొందిన నటుడు తిరువీర్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'పాపం ప్రతాప్' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఎస్పీ దుర్గా నరేష్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అజయ్ ఘోష్, రాశి, పాయల్ రాధాకృష్ణ, దేవి ప్రసాద్, గోపరాజు రమణ, రఘుబాబు కీలక పాత్రల్లో కనిపించారు.

కథ: గోదావరి జిల్లాల పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ కథలో ప్రతాప్ అనే యువకుడు చిన్నప్పటి నుంచే బుజ్జమ్మను ప్రేమిస్తాడు. పెద్దల సమ్మతితో ఇద్దరూ వివాహం చేసుకుంటారు. అయితే పెళ్లి తర్వాత వారి దాంపత్య జీవితంలో సమస్యలు తలెత్తుతాయి. ప్రతాప్‌లో ఉన్న ఓ లోపం కారణంగా బుజ్జమ్మ పుట్టింటికి వెళ్లిపోతుంది. ఆ సమస్యను తానే గుర్తించి పరిష్కరించుకుంటేనే తిరిగి వస్తానని షరతు పెడుతుంది. ఆ లోపం ఏమిటి, ప్రతాప్ దాన్ని ఎలా ఎదుర్కొన్నాడు, చివరికి వారి జీవితం ఎలా మలుపు తిరిగింది అన్నదే కథ.

విశ్లేషణ: సున్నితమైన అంశాన్ని దర్శకుడు గ్రామీణ హాస్యంతో మేళవించి చూపించే ప్రయత్నం చేశారు. తొలి భాగం సరదా సన్నివేశాలతో సాగుతుండగా, రెండో భాగంలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్‌లు కథను ముందుకు నడిపించాయి. కొన్ని చోట్ల కథ నెమ్మదిగా అనిపించినా, చివర్లో వచ్చే పంచాయితీ సన్నివేశాలు ఆసక్తిని పెంచుతాయి.

నటీనటుల నటన: ప్రధాన పాత్రలో తిరువీర్ సహజమైన నటనతో ఆకట్టుకున్నారు. పాయల్ రాధాకృష్ణ భావోద్వేగ సన్నివేశాల్లో మెప్పించారు. అజయ్ ఘోష్ తన కామెడీ టైమింగ్‌తో వినోదాన్ని అందించారు. రాశి క్లైమాక్స్ భాగంలో ప్రత్యేకంగా నిలిచారు.

సాంకేతిక విభాగం: సంగీతం, నేపథ్య సంగీతం కథకు అనుగుణంగా ఉన్నాయి. సినిమాటోగ్రఫీ గ్రామీణ వాతావరణాన్ని సహజంగా చూపించింది. నిర్మాణ విలువలు కూడా బాగున్నాయి.

మొత్తంగా: గ్రామీణ నేపథ్యంలో కుటుంబ భావోద్వేగాలు, సరదా సన్నివేశాలను ఇష్టపడే ప్రేక్షకులకు 'పాపం ప్రతాప్' ఒక మోతాదైన వినోదాన్ని అందించే చిత్రంగా నిలుస్తుంది.




Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad500013.Published at H. No. 63569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com